మంగళవారం
09-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 288
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కక్ష్యలోకి దక్షిణకొరియా నిఘా ఉపగ్రహం

సియోల్: దేశీయంగా తయారు చేసిన రెండో నిఘా ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు దక్షిణ కొరియా ప్రకటించింది. అమెరికాలోని వాండెన్‌బర్గ్ అంతరిక్ష స్థావరం నుంచి స్పేస్ ఎక్స్ కంపెనీకి చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా సోమవారం ఈ ప్రయోగం జరిగినట్లు వెల్లడించింది. విజయవంతంగా కక్ష్యలోకి చేరిన ఈ ఉపగ్రహం పనితీరు ఎలా ఉందో అక్కడి నుంచి వస్తున్న సంకేతాల ద్వారా ధ్రువీకరించుకుంటున్నట్లు తెలిపింది. సైనిక నిఘా ఉపగ్రహాన్ని ప్రయోగించినట్లు ఉత్తర కొరియా గత నవంబరులో ప్రకటించింది. ఆ తర్వాత వారం రోజులకే దక్షిణ కొరియా తన ప్రప్రథమ సైనిక గూఢచార ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

'సిట్' పత్రాల దహనం దుమారం



- అవి హెరిటేజ్ కీలకపత్రాలన్న కంపెనీ సెక్రటరీ
- వైసీపీ అధికారంలోకి రాదన్న భయంతోనే దగ్ధం : లోకేశ్
- వేస్ట్ పేపర్లు అంటూ కొట్టిపారేసిన సీఐడీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో ఒకపక్క ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న సమయంలో తాడేపల్లి సిట్ కార్యాలయం కాంపౌండ్‌లో కొన్ని పత్రాలను సిబ్బంది దహనం చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. వీరు దహనం చేసిన పత్రాల్లో హెరిటేజ్ కంపెనీకి సంబంధించినవని పేర్కొంటూ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం కలకలం రేగింది. అవి ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో సిట్ స్వాధీనం చేసుకున్న హెరిటేజ్‌కు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు అంటూ పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. దీంతో టీడీపీ నేతలు భగ్గుమన్నారు. తమపై అక్రమ కేసులు బనాయించేందుకు సృష్టించిన దొంగ పత్రాలు వైసీపీ అధికారం కోల్పోతే బయటపడతాయనే అధికారులు కాల్చివేశారంటూ ఆరోపించారు. పత్రాలు తగులబెడితే చేసిన పాపాలు పోతాయా? అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. నేర పరిశోధనపై దృష్టిసారించాల్సిన ఏపీ సీఐడి జగన్ పుణ్యమా అని క్రైమ్ ఇన్వాల్వ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌గా మారిపోయిందని విమర్శించారు. మేము ఎప్పటినుంచో చెబుతున్న మాటలు నేడు నిజమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో కొందరు ఐపీఎస్‌లు తమ ఉద్యోగ ధర్మాన్ని వీడి జేపీఎస్ (జగన్ పోలీస్ సర్వీస్) గా రూపాంతరం చెందారు. మా కుటుంబంపై బురదజల్లేందుకు జగన్ ఆదేశాలతో భారీ కుట్ర జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా సీఐడీ డీఐజీ రఘురామిరెడ్డి నేతృత్వాన అనుమతులు లేకుండా వ్యక్తిగత సమాచారాన్ని సేకరించారు. జగన్ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు సమీపించాయని తెలిసిపోవడంతో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆ పత్రాలను తగులబెడుతున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలస్తంభాలుగా నిలవాల్సిన కొందరు ఐపీఎస్‌లు ఇంతటి బరితెగింపునకు పాల్పడటం దేశచరిత్రలో ఇదే ప్రథమం. చట్టాన్ని ఉల్లంఘించి చేసిన తప్పుకు మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

ఆ డాక్యుమెంట్లు చాలా కీలకమైనవి : హెరిటేజ్ కంపెనీ సెక్రటరీ

ఈ ఘటనపై హెరిటేజ్ కంపెనీ సెక్రటరీ ఉమా కాంత్ బారిక్ స్పందిస్తూ సీఐడీ అడిషనల్ ఎస్పీకి లేఖ రాశారు. సీఐడీ కస్టడీలో ఉన్న తమ ఒరిజినల్ డాక్యుమెంట్లు, మినిట్ పుస్తకాలను తాము అధికారుల కోరిక మేరకు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. హెరిటేజ్‌కు సంబంధించిన పత్రాలను దగ్ధం చేసినట్లు సోషల్ మీడియా, టీవీ వార్తల్లో వచ్చిన అంశాన్ని ప్రస్తావిస్తూ తాము ఇచ్చిన డాక్యుమెంట్లు చాలా కీలకమైనవని పేర్కొన్నారు. తాము దర్యాప్తు సంస్థకు పూర్తిగా సహకరించడమే కాకుండా న్యాయబద్ధులై

- మిగతా 2 లో



వివేకా హత్య కేసులో నిందితుడు శివశంకరరెడ్డికి సుప్రీం నోటీసులు

తెలంగాణ హైకోర్టు బెయిల్ ఉత్తర్వులను సవాల్ చేసిన సునీత



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసులో 5వ నిందితుడుగా ఉన్న శివశంకర్ రెడ్డికి సుప్రీం కోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. జులై 22 నుంచి ప్రారంభమయ్యేలా వారంలో జాబితా చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. శివశంకర్ రెడ్డికి ఇటీవల తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో హైకోర్టు బెయిల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకానంద రెడ్డి కుమార్తె సునీత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు

- మిగతా 2 లో

జగన్‌కు ఝలక్!

- బస్సు యాత్రకు వైసీపీ నేతల డుమ్మా
- నెల్లూరులో ఆనం విజయ్ అసంతృప్తి
- దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి దూరం
- ఎన్‌డీఏ కూటమి వైపు చూపు!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'మేమంతా సిద్ధం' పేరుతో వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ చేపడుతున్న బస్సు యాత్రకు కీలక నేతలు దూరంగా ఉన్నారు. నెల్లూరు, ఒంగోలు జిల్లాకు చెందిన నేతలు డుమ్మా కొట్టడం వైసీపీకి పెద్ద షాక్‌గా మారింది. నెల్లూరు జిల్లాలో వైసీపీకి మొదటి నుంచి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సిట్టింగ్ రాజ్యసభ సభ్యుడు పార్టీ ఫిరాయించడంతో వైసీపీకి అక్కడ బలమైన నాయకత్వం కొరవడింది. దీనిని దృష్టిలో ఉంచుకునే అక్కడ ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని నియమించారు. జగన్ బస్సు యాత్రతో అంతా సద్దుమణుగుతుందని ఆశించినప్పటికీ నేతలు డుమ్మా కొట్టడంతో నిరాశే మిగిలింది. నెల్లూరుకు చెందిన ఆనం విజయ్‌కుమార్, ఆయన మరో సోదరుడు వైసీపీలోనే ఉన్నారు. ఆనం విజయ్‌కుమార్ సతీమణి ఆనం అరుణమ్మకు నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఇచ్చారు. బస్సు యాత్రలో జగన్ విరామం చేసినన ప్రాంతంలో ఆయనను కలిసేందుకు ఆనం విజయ్‌కుమార్, ఆయన సోదరుడికి అవకాశం

- మిగతా 2 లో

జనసేనలో ముదిరిన అసమ్మతి

- పోతిన మహేశ్ రాజీనామా... రాజోలులో బొంతు నిరసన
- పవన్‌పై ఈసీకి నవరంగ్ కాంగ్రెస్ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దే ఎన్డీయే కూటమిలోని జనసేన పార్టీకి షాక్‌లు మీద షాక్‌లు తగులుతున్నాయి. ఈనెల 10, 11 తేదీల్లో చంద్రబాబు, పవన్ ఉమ్మడి ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈలోగానే జనసేన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతిన మహేశ్ ఆ పార్టీకి రాజీనామా చేసి పవన్‌కు గట్టి షాక్ ఇచ్చారు. ఎన్డీయే కూటమి పార్టీల పొత్తులు, సీట్ల సర్దుబాటులో భాగంగా విజయవాడ పశ్చిమ సీటును బీజేపీకి కేటాయించారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపీ సుజనా చౌదరిని నియమించడంపై పోతిన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. చివరి నిమిషం వరకు విజయవాడ పశ్చిమ సీటు తనకు కేటాయించాలంటూ పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తులు చేసినా స్పందన లేదు. తన అనుచరులతో కలిసి ఆందోళనలు, నిరసనలు చేసినా, ఎన్డీయే కూటమి నేతలు వెనక్కి తగ్గలేదు. దీంతో జనసేనకు ఆయన రాజీనామా చేసి పవన్, నాదెండ్ల మనోహర్ తీరును ఎండగట్టారు. రాజోలు సీటుపైనా వివాదం నెలకొంది. రాజోలు జనసేన సీటును వరప్రసాద్‌కు కేటాయించడంపై అక్కడ బొంతు రాజేశ్వరరావు వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వరప్రసాద్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, కరపత్రాలను పంపిణీ చేయడం వివాదస్పదంగా మారింది. ఇటీవల జనసేనకు అమలాపురం ఇన్‌ఛార్జి రాజీనామా చేశారు. కాకినాడ రూరల్,

- మిగతా 2 లో

కేజ్రీవాల్‌కు హైకోర్టులో ఊరట

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. జైలు నుంచి పాలన చేయకుండా కేజ్రీవాల్‌ను అడ్డుకోవాలని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇది కేవలం ప్రచారం కోసం దాఖలు చేసిన పిటిషన్ మాత్రమేనని వ్యాఖ్యానించింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ జైలు నుంచే పాలన సాగిస్తున్నారు. జైలులో ఉంటూ సమర్థవంతమైన పాలన అందించలేరంటూ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని కొంతమంది డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ రాజీనామా చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కొందరు కోర్టుకు వెళ్లారు. ఆప్ మాజీ ఎమ్మెల్యే సందీప్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ధర్మాసనం ఇది కేవలం పబ్లిసిటీ కోసం చేసిన పని అని వ్యాఖ్యానించింది. ఈ మేరకు జస్టిస్ ప్రసాద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కేజ్రీవాల్ జైలు నుంచే పాలన సాగిస్తున్నారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాజ్యాంగం ప్రకారం ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించడంలో కేజ్రీవాల్ అసమర్థత కలిగి ఉన్నారని

- మిగతా 2 లో

ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్‌కు ఈడీ నోటీసులు

2లో

ఆప్ 'జేల్ కా జవాబ్ ఓట్ సే' ప్రచారానికి శ్రీకారం

ఆ నలుగుర్నీ తొలగించండి

ఈసీ కార్యాలయం ఎదుట టీఎంసీ ఎంపీల ధర్నా...ఉద్రిక్తం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం ఎదుట తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, నేతలు చేపట్టిన ధర్నా ఉద్రిక్తకు దారితీసింది. కేంద్రంలోని మోదీ సర్కారు తమ పార్టీ నాయకులపై కక్ష గట్టి నాలుగు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంపై తృణమూల్ ఎంపీలు ఎన్నికల కమిషనర్లను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ప్రధాన కార్యాలయం వద్ద 24 గంటల ధర్నాకు దిగారు. 24 గంటల ధర్నాకు దిగారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఐటీ, ఎన్ఐఏ, ఈడీ డైరెక్టర్లను మార్చాలని డిమాండ్ చేశారు. అయితే సుమారు గంటసేపు ధర్నా కొనసాగిన తర్వాత పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. తమ అరెస్టును తృణమూల్ ఎంపీలు ప్రతిఘటించడంతో పోలీసులు బలవంతంగా వారిని ఎత్తి పట్టుకుని బస్సులోకి ఎక్కించారు. ఈ క్రమంలో పోలీస్ బలగాలు, ఎంపీల మధ్య తోపులాట జరిగింది. ఎన్నికల ముందు నాలుగు కేంద్ర దర్యాప్తు సంస్థల అధిపతులను ఎన్నికల కమిషన్ తొలగించాలని ఎంపీలు డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లను కలిసిన టీఎంసీ ఎంపీల బృందానికి రాజ్యసభ లో పార్టీ నాయకుడు డెరెక్

- మిగతా 2 లో

మస్క్‌పై ప్రత్యేక విచారణ

2లో

ఇదీ లోకం!

వైసీపీ పాలనలో నష్టపోయిన రైతులు

- ఆధారాలు ఉన్నా అవినాశ్‌ను జగన్ కాపాడుతున్నారు
- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

విశాలాంధ్ర-కడప : వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ధరల స్థిరీకరణ అని చెప్పి జగన్ మోసం మోసం చేశారని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. బస్సు యాత్రలో భాగంగా సోమవారం వైఎస్సార్ జిల్లా మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారి మఠంలో ఆమె మాట్లాడారు. వైఎస్ పాలనతో జగన్ పాలనకు పొంతనే లేదన్నారు. భూతద్దం పెట్టి చూసినా ఆ ఆనవాళ్లు

- మిగతా 2 లో

మస్క్‌పై ప్రత్యేక విచారణ

బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆదేశం

రియోడీ జనీరో : కొంతమంది ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయాలని ఆదేశించిన బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించాలని ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి తప్పుడు సమాచార వ్యాప్తిపై జరుగుతున్న విచారణలో మస్క్‌ను కూడా చేర్చారు. ఈ నేపథ్యంలో ఆయనపై ప్రత్యేకంగా న్యాయ విచారణ జరపాలని నిర్ణయించారు. అసలేమైందంటే... బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డీ మోరేస్‌పై ఎలాన్ మస్క్ శనివారం సాయంత్రం నుంచి తన విమర్శనాస్త్రాలను ఎక్కుపెట్టారు. 'ఎక్స్'ను పూర్తిగా నిషేధిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. దీంతో బ్రెజిల్ నుంచి వచ్చే ఆదాయం మొత్తం పోతుందని, ఫలితంగా అక్కడ కార్యకలాపాలను మూసివేయాల్సి ఉంటుందని అన్నారు. అయినప్పటికీ తాము చింతించడం లేదని చెప్పారు. లాభాల కంటే తమకు సిద్ధాంతాలే ముఖ్యమని వ్యాఖ్యానించారు. బ్రెజిల్‌లో వాక్ స్వాతంత్ర్యంపై మోరేస్ విరుచుకుపడుతున్నారని మస్క్ సహా మరికొంతమంది ఆరోపించారు. అయితే మస్క్ చేసిన ఈ సంచలన వ్యాఖ్యలను బ్రెజిల్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. తప్పుడు సమాచార వ్యాప్తిపై జరుగుతున్న విచారణలో మస్క్‌ను కూడా చేర్చారు. కోర్టు కార్యకలాపాలకు అడ్డు పడుతున్నారని, తీర్పులకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అందుకు ఎక్స్‌ను ఆయుధంగా వాడుకుంటున్నారన్నారు. తద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న కొంతమంది వ్యక్తులకు మస్క్ మద్దతుగా నిలుస్తున్నారని న్యాయమూర్తి ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై ప్రత్యేకంగా న్యాయ విచారణ చేపట్టాలని న్యాయమూర్తి అలెగ్జాండర్ డీ మోరేస్ నిర్ణయించారు. కాగా బ్రెజిల్ న్యాయమూర్తి మోరేస్ ఇటీవల అనేకమంది ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయాలని ఆదేశించారు. వీరిలో చాలామంది బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో మద్దతుదారులే. అధ్యక్ష పదవికి మరోసారి పోటీ చేయడానికి బోల్సోనారో అనర్హుడంటూ 2023లో మోరేస్ నేతృత్వంలోని ఎలక్టోరల్ ట్రిబ్యునల్ తీర్పు వెలువరించింది.

రష్యాలో ఆకస్మిక వరదలు

మాస్కో: రష్యాను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వేగంగా మంచు కరిగిపోవడంతో యూరప్‌లోని అతిపెద్ద నదుల్లో కొన్ని నీటితో నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఉరల్ పర్వతాల్లో రికార్డు స్థాయిలో నీటి స్థాయిలు పెరిగాయి. నీటి ఉద్ధృతికి మాస్కోకు తూర్పున 1,800 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓర్స్క్ నగరంలోని ఆనకట్ట తెగిపోయింది. దీంతో సమీప గ్రామాలకు వరద పోటెత్తింది. భారీ మొత్తంలో నీరు సమీపంలోని గ్రామాల్లోకి ప్రవేశించింది. సుమారు 10వేలకు పైగా ఇళ్లు వరద ముంపునకు గురయ్యాయి. సైబీరియా, వోల్గా, రష్యాలోని మధ్య ప్రాంతాల్లో కూడా వరదలు సంభవించాయి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ఆ వేడికి మంచు కరగడంతో ఈ విపత్తు సంభవించినట్లు రష్యా అత్యవసర మంత్రిత్వ శాఖ తెలిపింది. సుమారు 39 ప్రాంతాల్లో 10,400 కంటే ఎక్కువ ఇళ్లు వరద ముంపునకు గురైనట్లు వెల్లడించింది. మరోవైపు అప్రమత్తమైన అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సుక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

అణు విద్యుత్ కేంద్రంపై డ్రోన్ దాడి...ఐరాస ఆందోళన

కీవ్: ఉక్రెయిన్‌లోని జపొరిజ్‌జియా అణు విద్యుత్ కేంద్రంపై ఇటీవల డ్రోన్ దాడి జరిగిన ఘటనపై ఐక్యరాజ్యసమితి అటామిక్ వాచ్‌డాగ్ ఆందోళన వ్యక్తం చేసింది. తీవ్ర స్థాయిలో అణు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నట్లు ఐరాస పేర్కొంది. ఆ డ్రోన్ దాడి వెనుక ఉక్రెయిన్ హస్తం ఉన్నట్లు రష్యా తెలిపింది. డ్రోన్ దాడిలో సుమారు ముగ్గురు గాయపడ్డారు. కానీ ఉక్రెయిన్ మాత్రం దీన్ని ఖండిస్తోంది. ఆరు అణు రియాక్టర్లు ఉన్న ఈ విద్యుత్ కేంద్రం ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో కీలకంగా మారింది. డ్రోన్ దాడులపై అప్రమత్తంగా ఉండాలని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ పేర్కొంది. చాలా నిర్లక్ష్యంగా డ్రోన్ దాడి చేసినట్లు ఐఏఈఏ అధిపతి రాఫేల్ గ్రోసి తెలిపారు. అణు విద్యుత్ ప్లాంట్ వద్ద ప్రస్తుతం భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు ఆయన వెల్లడించారు. దక్షిణ ఉక్రెయిన్‌లో ఉన్న జపొరిజ్‌జియా ఈ అణు విద్యుత్ కేంద్రం యూరోప్‌లోనే పెద్దది. అయితే రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైన తర్వాత దాన్ని రష్యా దళాలు ఆక్రమించేశాయి. 2022 ఫిబ్రవరి నుంచి ఆ ప్లాంట్ రష్యా ఆధీనంలోనే ఉంది. జపొరిజ్‌జియా వద్ద డ్రోన్ దాడి వల్ల స్వల్పంగా భౌతిక నష్టం జరిగినట్లు ఐఏఈఏ నిపుణులు వెల్లడించారు. ఓ రియాక్టర్ కూడా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ప్లాంట్ వద్ద రేడియేషన్ లెవల్స్ సాధారణంగానే ఉన్నాయని, భయపడాల్సినంత నష్టం జరగలేదని ప్లాంట్ సిబ్బంది చెబుతున్నారు.

జగన్‌కు ఝలక్!

(మొదటిపేజీ తరువాయి)

దక్కకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. దీంతో అక్కడ జరిగిన 'మేమంతా సిద్ధం' సభా వేదికపై వారు దూరంగా ఉండటంతో వైసీపీలో టెన్షన్ మొదలైంది. ప్రకాశం జిల్లాలోనూ జగన్ బస్సు యాత్రకు దర్శి సిట్టింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, ఆయన సోదరుడు శ్రీధర్ డుమ్మా కొట్టారు. వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల మార్పులు చేర్పుల్లో భాగంగా మద్దిశెట్టిని కాదని, బూచేపల్లిని అభ్యర్థిగా నిలబెట్టింది. దీంతో తనను కాదని బూచేపల్లికి ఇవ్వడంపై మద్దిశెట్టి మనస్తాపం చెంది, అప్పటి నుంచి వైసీపీ కార్యకలాపాలకు, నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. త్వరలో మద్దిశెట్టి సోదరులు ఎన్‌డీఏ కూటమిలోని భాగస్వామ్య పార్టీ అయిన టీడీపీలో చేరతారన్న ప్రచారం ఉంది. వారంతా దర్శి నియోజకవర్గంలో సొంత నాయకత్వాన్ని కొనసాగిస్తున్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి చక్రం తిప్పేందుకుగాను మద్దిశెట్టి సోదరులు వ్యూహం రచిస్తున్నారు. మొదటినుంచి దర్శి వైసీపీ అభ్యర్థి బూచేపల్లికి, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. వైసీపీ తుది జాబితాలో మద్దిశెట్టికి చోటు దక్కకపోవడంతో ఆయన పార్టీ వీడేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆర్థర్, ఎలిజా, ఎం.ఎస్.బాబు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. శింగనమల మాజీ ఎమ్మెల్యే యామిని బాల కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి వైసీపీని వీడారు. వైసీపీకి రాజీనామాలు చేసిన వారిలో కొందరు టీడీపీలోను, మరికొందరు కాంగ్రెస్‌లోకి వెళుతున్నారు. 21 రోజులపాటు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కొనసాగనుంది. ఇప్పటికే 11 రోజులు పూర్తయింది. ఈ బస్సు యాత్ర ముగిసేలోపు మరికొందరు కీలక నేతలు వైసీపీని వీడే అవకాశాలున్నాయి. వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల మార్పులు, చేర్పుల్లో భాగంగా 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు లభించలేదు. వారిలో చాలా మంది అసంతృప్తిగా ఉన్నారు. జగన్ బస్సు యాత్ర ముగిసే నాటికి కొందరు కీలక నేతలు పార్టీని వీడతారని సమాచారం. మరోవైపు టీడీపీ, జనసేన నుంచి వైసీపీలోకి పెద్దఎత్తున చేరుతున్నారు. జగన్ బస్సు యాత్ర చేస్తున్న ప్రాంతానికి వెళ్లి వైసీపీ కండువాలు కప్పుకుంటున్నారు. బస్సు యాత్ర ముగిసేనాటికి టీడీపీ, జనసేనలోని అసంతృప్త నేతలంతా వైసీపీలోకి చేరతారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

ఆప్ 'జేల్ కా జవాబ్ ఓట్ సే' ప్రచారానికి శ్రీకారం

న్యూఢిల్లీ: జైలుకు వెళ్లిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సంఘీభావంగా నిరాహార దీక్ష చేపట్టిన ఆప్ పార్టీ సరికొత్త నినాదంతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కేజ్రీవాల్‌ను జైలుకు పంపినందుకు ఓటుతో సమాధానం చెప్పండంటూ 'జైల్ కా జవాబ్ ఓట్ సే' ప్రచారాన్ని సోమవారం ప్రారంభించింది. ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ దీనిపై మాట్లాడుతూ కేజ్రీవాల్‌ను ఎన్నికలకు దూరంగా ఉంచాలనే ఆలోచనతోనే జైలుకు పంపిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. కేజ్రీవాల్ తన యావజ్జీవితం ప్రజల కోసమే పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి అందరికీ ఉత్తమ విద్య, ఆరోగ్యం, విద్యుత్, నీరు అందించేందుకు ఎంతో తపన పడుతున్నారని అన్నారు. 'జైల్ కా జవాబ్ ఓట్ సే' నినాదంతో ఢిల్లీలో ఇంటింటికి వెళ్లి తాము ఈరోజు నుంచే ప్రచారం ప్రారంభిస్తున్నామని, ఆప్ పోటీ చేస్తున్న నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల్లో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తారని తెలిపారు. దీనికి ముందు, కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా జంతర్ మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేసిన ఆప్ నేతలు... తమ నేతను జైలుకు పంపిన బీజేపీకి ప్రజలు రాబోయే ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీకి ధైర్యం ఉంటే ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించాలని సవాలు చేశారు. అదే జరిగితే దేశ రాజధానిలో బీజేపీ తుడిచిపెట్టుకు పోవడం ఖాయమని అన్నారు. పెద్ద ఎత్తున ఆప్ కార్యకర్తలు, మద్దతుదారులు ఈ నిరాహార దీక్షలో పాల్గొని కేజ్రీవాల్ కటకటాల వెనుక ఉన్న పోస్టర్లను ప్రదర్శిస్తూ దేశభక్తి గీతాలు ఆలపించారు.

కేజ్రీవాల్‌కు హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపిస్తూ సందీప్ కుమార్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలోనూ కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలంటూ దాఖలైన రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను హైకోర్టు తిరస్కరించింది. ఈ నెల నాలుగున తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్, జస్టిస్ మన్మీత్ పీఎస్ అరోరాతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై పిటిషన్‌ను స్వీకరించేందుకు నిరాకరించింది, ముఖ్యమంత్రిగా కొనసాగడం...కొనసాగకపోవడం అనేది కేజ్రీవాల్ వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేసింది.

ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్‌కు ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు తనతో పాటు మరో ముగ్గురు నేతలు అరెస్టు అవుతారంటూ ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశి చేసిన వ్యాఖ్యలు నిజమవుతున్నట్లు కనిపిస్తోంది. ఆ నలుగురిలో ఒకరైన ఎమ్మెల్యే దుర్గేశ్ పాథక్‌కు ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సోమవారం ఈడీ నోటీసులు ఇచ్చింది. మధ్యాహ్నమే హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. అదే సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు(పీఏ)ను దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది. కొన్ని దస్త్రాలకు సంబంధించి స్పష్టత కోసం ఆయనను విచారించింది. గత నెల అరెస్టయిన కేజ్రీవాల్ విచారణలో కీలక విషయాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. నిందితుడైన విజయ్ నాయర్ తన మంత్రి వర్గంలోని అతిశి, సౌరభ్‌కు రిపోర్టు చేసేవాడని సీఎం పేర్కొన్నట్లు ఏఎస్‌జీ ఎస్వీ రాజు కోర్టుకు వెల్లడించారు. తమ పేర్లు బయటకు వచ్చిన నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ సంచలన విషయాలు వెల్లడించారు. 'నాతో పాటు సౌరభ్ భరద్వాజ్, దుర్గేశ్ పాథక్, రాఘవ్ చద్దా త్వరలో అరెస్టవుతారు' అని వ్యాఖ్యానించారు. తాజాగా రాజేందర్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాథక్‌కు నోటీసులు వచ్చాయి.

ఇండియా కూటమి గెలుపే దేశానికి రక్ష

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: దేశంలో పేదలకు తిండి దొరకాలన్నా... మతసామర్యం కాపాడబడాలన్నా... కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని రక్షించాలన్నా అది ఒక్క ఇండియా కూటమి గెలుపు ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సీపీఐ గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్ నుంచి ఆయన సోమవారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బాధ్యతాయుతంగా ఆలోచించి ఓటు వేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారంలోకి రాకముందు పెట్రోల్ రూ.50లు, డీజిల్ రూ.60లు, వంటగ్యాస్ రూ.390లు ఉంటే ఆయన అధికారం చేపట్టిన తరువాత పెట్రోల్, డీజిల్ రూ.100లకు, వంట గ్యాస్ రూ.1000లకు చేరాయని అన్నారు. దీని ప్రభావం నిత్యావసర సరుకులపై పడి వాటి ధరలు ఆకాశాన్నంటి సామాన్యుల పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. అంతేకాకుండా మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ భారతదేశ లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని మోదీ సర్కారు ఖూనీ చేసిందని విమర్శించారు. మణిపూర్, యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాలలో మైనారిటీలు, క్రైస్తవులపై జరిగిన దాడులే అందుకు పరాకాష్ఠగా నిలుస్తాయన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సైతం తుంగలోతొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక, పారిశ్రామిక రంగాలు అంబానీ, అదానీ, మరో 20 మంది గుజరాతీ పెట్టుబడిదారుల కబంధహస్తాలలో చిక్కుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగాన్ని నిట్టనిలువునా ముంచింది కూడా గుజరాతీ పెట్టుబడిదారులేనని ఆయన అన్నారు. అందుకే ప్రజలు ఆలోచించి ఎన్డీయే కూటమిని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించండి:

గుంటూరు పార్లమెంట్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కరించేందుకు తనకు ఎంపీగా అవకాశం కల్పించాలని జంగాల అజయ్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతి ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా పోరాటంలోనూ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా 30 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో పెనవేసుకుని ఉన్న తాను నేడు ఇండియా కూటమి తరఫున గుంటూరు ఎంపీగా సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని... కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా పార్లమెంట్ పరిధిలో మంగళగిరి నుంచి జొన్నా శివశంకర్, పొన్నూరు-జక్కా రవీంద్రనాథ్, ప్రత్తిపాడు-కొరివి వినయ్‌కుమార్, గుంటూరు తూర్పు-షేక్ మస్తాన్‌వలి, తాడికొండ-చిలకా విజయ్‌కుమార్ ఇండియా కూటమి తరుపున శాసనసభకు పోటీలో ఉన్నారని, వీరిందరి గెలుపునకు కూడా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

జనసేనలో ముదిరిన అసమ్మతి

(మొదటిపేజీ తరువాయి)

పిఠాపురం, విజయవాడ తూర్పు తదితర నియోజకవర్గాల్లో జనసేనకు సీట్లు దక్కని వారంతా పార్టీని వీడుతున్నారు. అవనిగడ్డ అసెంబ్లీ సీటును టీడీపీ నుంచి వచ్చిన మండలి బుద్ధప్రసాద్‌కు కేటాయించడంపై అక్కడి స్థానిక నేతలు వ్యతిరేకిస్తున్నారు. జనసేన సోషల్ మీడియా ప్రచారంలో టీడీపీ, బీజేపీ నేతల ఫోటోలు ఎక్కడా కన్పించడం లేదు. కేవల జనసేన పోటీ చేసే స్థానాలకే పవన్ కల్యాణ్ ప్రచారం పరిమితమైంది. పొత్తు ధర్మంలో భాగంగా మిగిలిన నియోజకవర్గాలకు ఆయన వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. మొత్తంగా ఎన్నికల సమయానికి జనసేన పార్టీ పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి ఉందని అసమ్మతి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

పవన్‌ను టెన్షన్ పెడుతున్న బక్కెట్టు గుర్తు

జనసేన పార్టీకి ఫ్రీ సింబల్ పెద్ద సమస్యగా మారింది. దీనికితోడు మరో బక్కెట్ గుర్తు ఉన్న నవరంగ్ కాంగ్రెస్ పార్టీ పవన్‌ను టెన్షన్‌కు గురిచేస్తోంది. జనసేనకు చెందిన గాజు గ్లాసు గుర్తు, దానికి దగ్గరగా బక్కెట్ గుర్తు ఉంటుంది. జనసేన నేత పవన్ కల్యాణ్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ ఫిర్యాదు చేశారు. బక్కెట్ గుర్తు ఉన్న నవరంగ్ పార్టీని పోటీ చేయవద్దని పవన్ తనను బెదిరిస్తున్నారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. పవన్‌తోపాటు ఎంపీ బాలశౌరి, నాదెండ్ల మనోహర్‌పై ఆయన ఫిర్యాదు చేశారు. తనకు రూ.ఐదు కోట్లు ఇస్తానని పవన్ చెప్పారని, అయినా వారి ప్రలోభాలకు లొంగలేదని, తామంతా జేడీ లక్ష్మీనారాయణ నాయకత్వంలో యునైటెడ్ ఫ్రంట్‌గా పోటీ చేస్తున్నామని వివరించారు. తనను బెరిరిస్తున్న పవన్ కల్యాణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు.

శివశంకరరెడ్డికి సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. వివేకా హత్య కేసులో కీలక నిందితుడైన శివశంకర్ రెడ్డి బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. దీనిపై విచారణలో భాగంగా శివశంకర్ రెడ్డికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. శివశంకర్‌రెడ్డి ఏ-5గా ఉండగా, ఆయనతో పాటు ప్రతివాదులందరికీ అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ప్రతివాదిగా దర్యాప్తు సంస్థ సీబీఐని కూడా సునీత చేర్చారు. వాదనల సమయంలో విచారణ ఏ దశలో ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. అభియోగాలు నమోదు చేసే దశలోనే ఉన్నట్లు సునీత తరపు న్యాయవాది బదులిచ్చారు. ప్రతి దశలోనూ విచారణ సాగుకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ఇతర నిందితులు కూడా బెయిల్ పొందారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఏ1కు గతంలో బెయిల్ రాగా, సుప్రీం కోర్టు స్టే ఇచ్చిందని న్యాయవాది తెలిపారు. ఇదే కేసుకు సంబంధించి గతంలో దాఖలయిన అనేక పిటిషన్లపై విచారణ జరగాల్సి ఉందని చెప్పారు. ఈ నెల మూడో వారంలో ఇదే ధర్మాసనం ముందుకు వస్తుందని చెప్పారు. ఏ8 మాత్రం ముందస్తు బెయిల్‌పై ఉన్నారని, దీనిపై ఇప్పటికే సవాల్ చేసినట్లు తెలిపారు.

'జనసేన' గల్లంతు ఖాయం

- రాజకీయాల్లో పవన్ నటన అమోఘం
- స్వార్థం కోసమే పార్టీ
- టీడీపీకి జనసైనికుల బలి
- త్వరలో పార్టీకి రాజీనామా: పోతిన

విశాలాంధ్ర-విజయవాడ: రాజకీయాల్లో పవన్ కల్యాణ్ బాగా నటిస్తున్నారు. తన స్వార్థం కోసమే జనసేన పార్టీ పెట్టారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ కోసం జనసైనికులను బలి చేస్తున్నారని ఆరోపించారు. త్యాగాలను బీసీలే చేయాలా అని ప్రశ్నించారు. కులాల మధ్య చిచ్చుపెట్టాలని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. విజయవాడ పశ్చిమ పెత్తందారులకు కాకుండా ఎవరికి ఇచ్చినా సహకరించేవాడినన్నారు. పవన్‌ను నమ్మి నట్టేటమునిగామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలు లేదా ఏడాదిలోపు జనసేన పార్టీ గల్లంతుకావడం ఖాయమన్నారు. జనసేన... ప్రజారాజ్యం పార్ట్-2 అవుతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన టీడీపీ చేతుల్లోకి వెళ్లిపోయిందని స్పష్టం చేశారు. నాగబాబుకు టికెట్ కేటాయించకపోవడం పొత్తుధర్మం ఎలా అవుతుందని పోతిన ప్రశ్నించారు. నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. జనసేనకు ఆవేశంతోనో... సీటు రాలేదనో రాజీనామా చేయడం లేదని, కొత్తతరం నేతల్ని పవన్ తమారు చేస్తారని గుడ్డిగా నమ్మి అడుగులు వేశామన్నారు. 2019లో జనసేనకు ఒక్క సీటు వచ్చినా పవన్‌తో నడిచి భంగపడ్డామన్నారు. పార్టీ నిర్మాణంపై, కేడర్‌పై పవన్ ఏనాడూ దృష్టి పెట్టలేదన్నారు. జనసేనలో పనిచేసే వారికి టికెట్లు ఇవ్వకుండా టీడీపీ వారికి ఇస్తున్నారన్నారు. కమ్మ సామాజిక వర్గానికి పెద్దపీట వేసి, కాపు సామాజిక వర్గాన్ని బలి ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో వచ్చి ఆస్తులు అమ్ముకుంటే పవన్ ఆస్తులు కొన్నారన్నారు. తన దగ్గర ఆధారాలు ఉన్నాయని, వాటిని త్వరలోనే బయట పెడతానన్నారు. జనసేన వీర మహిళలను మోసం చేయాలని ఎలా అనుకున్నారని మండిపడ్డారు. టీడీపీతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని టికెట్లు ఇచ్చారని, భీమవరం సీటు జనసేనకు ఇవ్వకుండా టీడీపీకి ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. మరో రెండు రోజుల్లో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు.

'సిట్' పత్రాల దహనం దుమారం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటామని, ఇదే సమయంలో డాక్యుమెంట్ల భద్రత కూడా అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న అంశమని తెలియజేశారు.

అవి వేస్ట్ పేపర్లంటూ సీఐడీ వివరణ

ఫైళ్ల దగ్ధం ఘటన రాజకీయ వర్గాల్లో కలకలం రేపడంతో సీఐడీ వెంటనే దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. తాము దగ్ధం చేసిన పత్రాలు వేస్ట్ పేపర్లు అంటూ వివరణ ఇచ్చింది. తాము మొత్తం 5 కేసుల్లో ఛార్జ్‌షీట్ వేశామని, ఒక్కో ఛార్జ్‌షీట్‌లో 8 వేల నుంచి 10 వేల పేజీల డాక్యుమెంట్లు ఉన్నాయని పేర్కొంది. చాలా ఫోటోస్టాట్ కాపీలు తీయాల్సి వస్తుందని ఐజీ తెలిపారు. జిరాక్సులు తీసే సమయంలో ఫోటోస్టాట్ మిషన్ వేడెక్కడం వల్ల పేపర్ స్టక్ అవుతుందని ఇంక్ లెవల్ కూడా తగ్గిపోతుందని వివరణ ఇచ్చారు. దీనివలన కొన్ని కాపీలు సరిగ్గా రావని, వీటన్నింటిని కూడా వేస్టు పేపర్లుగా గుర్తించి దగ్ధం చేస్తామని, వాటి స్థానంలో తాజా కాపీలు తీసుకుంటామని ఐజీ వెల్లడించారు. ప్రస్తుతం దహనం చేసిన కాగితాలు కూడా అటువంటివేనంటూ వివరణ ఇచ్చారు.

సిట్ పత్రాలు దగ్ధం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలి : సీపీఐ నేత రామకృష్ణ డిమాండ్

తాడేపల్లి సిట్ కార్యాలయంలో పత్రాలు తగలబెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సీఐడీ చీఫ్ రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు ఫేక్ ఆధారాలు, కీలక డాక్యుమెంట్లను సిబ్బంది తగులబెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో హెరిటేజ్ సంస్థకు సంబంధించిన పత్రాలను దగ్ధం చేయటం వెనుక ఆంతర్యం ఏమిటి? తెలంగాణలో ఫోన్ టాపింగ్ వ్యవహారం మాదిరిగా ఏపీలో సిట్ అక్రమ కేసుల వ్యవహారం సాగినట్లుగా గోచరిస్తున్నది. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా సీఐడీ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించడంలో, బెదిరింపులకు గురిచేయడంలో కీలకపాత్ర పోషించింది. వివిధ అక్రమ కేసులలో తప్పుడు పత్రాలు సృష్టించినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల తదుపరి నూతన ప్రభుత్వం ఏర్పడినట్లయితే సీఐడీ అక్రమాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే కీలక పత్రాలను దగ్ధం చేశారా? అనే అనుమానం కలుగుతోంది. అందువల్ల సిట్ కార్యాలయంలో పత్రాలు తగలబెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఆ నలుగుర్నీ తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

ఓబ్రెయిన్ నాయకత్వం వహించారు. ధర్నాలో పాల్గొన్న ఎంపీలలో డోలా సేన్, సాగరిక ఘోష్, సాకేత్ గోఖలే, శంతను సేన్ తదితరులు ఉన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు అధికార బీజేపీ ఆదేశాల మేరకు తమ పార్టీ నేతల్ని టార్గెట్ చేస్తున్నాయని... అన్ని పార్టీలతో సమానంగా వ్యవహరిస్తూ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఈసీ జోక్యం చేసుకోవాలని కోరారు. 2022 నాటి కేసుకు సంబంధించి ఎన్ఐఏ 2024లో అరెస్టు చేస్తోందని డోలాసేన్ అన్నారు. శాంతిభద్రతలు అనేది రాష్ట్రానికి సంబంధించిన అంశమని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని గుర్తు చేశారు. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ, ఐటీ ఏజెన్సీల చీఫ్‌లను కచ్చితంగా మార్చాల్సిందేనని డిమాండ్ చేశారు. అలాగే, ఢిల్లీకి బయల్దేరే ముందు కోల్‌కతా విమానాశ్రయం వద్ద డోలా సేన్ మీడియాతో మాట్లాడుతూ.. దర్యాప్తు సంస్థలు కేంద్రంలో భాజపా ఆదేశాలమేరకు పనిచేస్తూ విపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకొని వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర సంస్థలను భాజపా దుర్వినియోగం చేస్తోందన్నారు.

ఎన్ఐఏ, ఈడీ, సీబీఐ తృణమూల్ కాంగ్రెస్ నేతల్ని టార్గెట్ చేస్తూ పనిచేయడం సిగ్గు చేటన్నారు. రెండేళ్ల క్రితం నాటి ఓ పేలుడు కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోల్‌కతాకు తరలిస్తున్న ఎన్ఐఏ అధికారుల వాహనంపై ఇటీవల భూపతినగర్‌లో స్థానికులు రాళ్ల దాడికి దిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ఆత్మరక్షణ చర్యగా సీఎం మమతా సమర్థించారు కూడా.

వైసీపీ పాలనలో నష్టపోయిన రైతులు

(మొదటిపేజీ తరువాయి)

కనిపించవని చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సీఎం జగన్ వారసుడే కాదని తెలిపారు. 'వైఎస్సార్ హయాంలో రైతు రారాజు... ఇప్పుడు అప్పు లేని రైతే లేదు. పంట నష్టం జరిగితే రూపాయి కూడా పరిహారం రావడం లేదు. డ్రిప్ వేసుకోవడానికీ అవకాశం లేకుండా సబ్సిడీలన్నీ ఆపేశారు. సంపూర్ణ మద్య నిషేధం హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వమే విక్రయిస్తోంది. ఇష్టారీతిన అమ్ముతున్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పారు. నాలుగున్నరేళ్లు నిద్రపోయి కేవలం 6 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. జగన్‌ది హత్యా రాజకీయాలు చేసే పాలన. సొంత బాబాయిని చంపిన నిందితులను కాపాడుతున్నారు. నిందితుడిగా ఉన్న అవినాశ్‌కే మళ్లీ టికెట్ ఇచ్చారు. అతను చట్టసభల్లోకి వెళ్లకూడదు. అన్యాయాన్ని ఎదిరించేందుకే ఎంపీగా పోటీ చేస్తున్నా. హంతకులకు ఓటు వేయొద్దు. వైఎస్సార్ బిడ్డను గెలిపించాలని కోరుతున్నా. ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటా' అని షర్మిల అన్నారు.

మాజీ మంత్రి వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డి నిందితుడని సీబీఐ చెప్పిందని... కాల్ రికార్డులు, గూగుల్ మ్యాప్స్, లావాదేవీలు ఉన్నట్లు పేర్కొందని గుర్తు చేశారు. అన్ని ఆధారాలు ఉన్నా అతనిని జగన్ కాపాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివేకాను చంపి మమ్మల్ని రోడ్ల పాల్జేశారు : సునీత

ఆడది అంటే నారీ శక్తి అని వివేకా కుమార్తె సునీత అన్నారు. తమను అలాగే పెంచారని చెప్పారు. షర్మిలతో కలిసి బస్సు యాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. 'తప్పు అంటే తప్పు అని చెప్పే మనస్తత్వం మాది. వివేకాను ఎవరు హత్య చేశారో అందరికీ తెలుసు. న్యాయం కోసం పోరాడుతున్నాం. ఆయన్ను చంపి మమ్మల్ని రోడ్ల పాల్జేశారు. షర్మిలను ఎంపీగా చూడాలనేది వివేకా కోరిక. ప్రజలు భారీ మెజారిటీతో ఆమెను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని సునీత అన్నారు.

వైసీపీ కవ్వింపు చర్యలు

వైఎస్సార్ జిల్లా దువ్వూరులో షర్మిల నిర్వహించిన బస్సు యాత్రలో వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఆమె ప్రసంగిస్తుండగా 'జై జగన్' అంటూ ఆ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దమ్ముంటే నా దగ్గరకు వచ్చి మాట్లాడండి' అంటూ మండిపడ్డారు. జగన్ చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని సవాల్ విసిరారు. ఆమె వద్దకు వచ్చి మైకు తీసుకొని చంద్ర ఓబుల్‌రెడ్డి అనే వైసీపీ కార్యకర్త మాట్లాడారు. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మేలు చేశారని, ఆయనకు సహకరించాలని కోరారు. గతంలో తాను కూడా 'జై జగన్' అన్నానని, 3,200 కి.మీ పాదయాత్ర చేశానని షర్మిల చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 'నా అనే వాళ్లను, రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారు' అని వివరించారు.

బెంగాల్‌లో మోదీ వర్సెస్ మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులపై దాడుల ఘటన రాజకీయ వేడి పెంచుతోంది. దోపిడీ, అవినీతి చేసే వారిని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కాపాడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఘాటుగా స్పందించిన టీఎంసీ వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని భావిస్తున్న మోదీ భారత మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రికార్డును సమం చేయాలని భావిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల ద్వారా అవినీతి, హింసకు లైసెన్సు కావాలని కోరుతున్నారని విమర్శించారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి

- లేకపోతే 40 లక్షల ఓట్లు కోల్పోతారు
- జగన్‌కు ముప్పాళ్ల హితవు
- సీఎంకు పూలు పంపిన అగ్రిగోల్డ్ బాధితులు

విశాలాంధ్ర-గుంటూరు: అగ్రిగోల్డ్ సంస్థ మోసం కారణంగా చనిపోయిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా పువ్వుల్లో పెట్టి ఇంటికి పంపుతానన్న సీఎం జగన్ హామీ నేటికి నెరవేరలేదని, తక్షణమే ఆ హామీ నిలబెట్టుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సమితి అధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టీన్ అధ్యక్షతన సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అగ్రిగోల్డ్ బాధితులకు జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ... మరణించిన బాధిత కుటుంబాలతో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి పార్శిల్ ద్వారా పూలు పంపారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆరు మాసాలుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞాపన పత్రాలు అందజేసి బాధితులు అలసిపోయారని, అందుకే సీఎంకు బాధితులు పూలు పంపే కార్యక్రమం చేపట్టారన్నారు. 2017 మార్చి 23న ప్రతిపక్ష నాయకుడి హోదాలో విజయవాడలో జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల దీక్ష శిబిరానికి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి...చనిపోయిన ప్రతి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తానని చెప్పారని గుర్తుచేశారు. కానీ అధికారం చేపట్టిన తర్వాత ఒక్క కుటుంబానికి కూడా రూ.10 లక్షలు ఇవ్వలేదని విమర్శించారు. ఇంతకన్నా దగా మరొకటి ఉండదన్నారు. చనిపోయిన 600 మంది బాధితుల జాబితా జిల్లా ఎస్పీలు, కలెక్టర్ల వద్ద ఉందని, దానిని విచారించి గత ప్రభుత్వంలో రూ.5 లక్షలు తీసుకున్న బాధితులకు మరో రూ.5 లక్షలతోపాటు మిగిలిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. కంపెనీ ఆస్తులను ఎందుకు అమ్మలేదని ప్రశ్నించారు. కంపెనీ యాజమాన్యానికి మేలు చేయడం కోసమే ఆస్తులు అమ్మలేదన్నారు. ఇప్పటికైనా ఆదుకోకపోతే బాధిత కుటుంబాలకు సంబంధించిన 40 లక్షల ఓట్లు కోల్పోతారని ముప్పాళ్ల హెచ్చరించారు. టీడీపీ సైతం అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. ఉగాది సందర్భంగా పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను తమ అసోసియేషన్ ప్రతినిధులు కలవనున్నట్లు ముప్పాళ్ల తెలిపారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జగన్ మాటతప్పి మడమ తిప్పారని విమర్శించారు. ఓట్లు వేసి గెలిపించిన అగ్రిగోల్డ్ బాధితులను నట్టేటముంచారని మండిపడ్డారు.

కుర్చీలు తిరగబడతాయ్: అంజనా దేవి

రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షాలు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వారి కుర్చీలు తిరగబడతాయని అసోసియేషన్ రాష్ట్ర మహిళా నాయకురాలు అంజనా దేవి హెచ్చరించారు. అగ్రిగోల్డ్ బాధితులతో పాటు చనిపోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తానని జగన్‌మోహన్ రెడ్డి మాటిచ్చారని, న్యాయం చేయాలని అడిగే హక్కు తమకు ఉందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలలో అగ్రిగోల్డ్ బాధితులు ఉన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తమకు కూడా బటన్ నొక్కే అవకాశం వచ్చిందని, ఈ విషయాన్ని మర్చిపోవద్దని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, అసోసియేషన్ నాయకులు పెదరామయ్య, సాంబ శివరావు, షేక్ కరీముల్లా, రత్నమాల, ఇస్టా జాతీయ కార్యదర్శి గని, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, మృతిచెందిన బాధిత కుటుంబాల సభ్యులు తిరుపతిరెడ్డి, శేషగిరిరావు, హనీమీ బాయి, షేక్ బేగం, పి.అనురాధ, పి.నాగరాజు, సాలీబాయి, కమలి బాయి, సుబ్బాయమ్మ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అరకు ఎంపీ, పది అసెంబ్లీ స్థానాలకు సీపీఎం పోటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఎన్నికల్లో అరకు ఎంపీ సీటుతో పాటు పది అసెంబ్లీ స్థానాల్లో పోటీకి సీపీఎం రాష్ట్ర కమిటీ ఆమోదించింది. ఈ మేరకు అభ్యర్థుల వివరాలను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెల్లడించారు. కాంగ్రెస్‌తో అనేక దఫాలుగా జరిగిన చర్చల అనంతరం అరకు పార్లమెంటు, ఐదు అసెంబ్లీ (రంపచోడవరం, కురుపాం, గన్నవరం, మంగళగిరి, నెల్లూరు సిటీ) స్థానాలపై ఉమ్మడి అవగాహన కుదిరిందని తెలిపారు. మిగిలిన ఐదు స్థానాలపై చర్చలు కొనసాగించి నామినేషన్‌లోగా ఒక అవగా హనకు రావాలని ఉభయ పార్టీలు అభిప్రాయపడ్డాయని పేర్కొన్నారు. సీపీఎం, సీపీఐ పోటీ చేస్తున్న పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో పరస్పరం బలపర్చుకోవాలని ఆయా పార్టీలు ఉమ్మడి అవగాహనకు వచ్చాయని స్పష్టంచేశారు. అరకు పార్లమెంట్ (ఎస్టీ) పాచిపెంట అప్పలనర్స, అసెంబ్లీ స్థానాలకు రంపచోడవరం (ఎస్‌టి)- లోతా రామారావు, అరకు (ఎస్‌టి)- దీసరి గంగరాజు, కురుపాం (ఎస్‌టి)- మండంగి రమణ, గాజువాక-మరడాన జగ్గునాయుడు, విజయవాడ సెంట్రల్-చిగురుపాటి బాబురావు, గన్నవరం-కళ్ళం వెంకటేశ్వరరావు, మంగళగిరి-జొన్నా శివశంకర్, నెల్లూరు సిటీ-మూలం రమేశ్, కర్నూలు-డి.గౌస్‌దేశాయి, సంతనూతల పాడు (ఎస్‌సీ)- ఉబ్బా ఆదిలక్ష్మి పోటీ చేస్తారని వివరించారు.

జూన్ 12 తర్వాత కూడా

'వాటర్ బెల్' విధానం కొనసాగించండి

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాలల పునః ప్రారంభం (జూన్ 12) తర్వాత కూడా 'వాటర్ బెల్' విధానాన్ని యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగింపు (ఈనెల 23) వరకు ప్రతిరోజూ వాటర్ బెల్ నిర్వహణను పర్యవేక్షించాలని డీఈవోలకు సూచించారు. మూత్రం రంగును బట్టి తమ శరీరంలో నీటి లోపాన్ని గుర్తించి నీరు తాగే అలవాటు విద్యార్థుల్లో పెంపొందించేందుకు వీలుగా వారు గుర్తించేలా పోస్టర్‌ను జతపరిచామని వివరించారు. ఈ పోస్టర్లను పోస్ట్‌కార్డ్ సైజులో ముద్రించి ప్రతి మూత్రశాల, టాయిలెట్ బ్లాక్ ముందు అతికించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూత్రం ఏ రంగూ లేకుండా వస్తే పారదర్శకంగా ఉందని, నీరు అధికంగా తాగుతున్నారని, లేత గోధుమ రంగు వస్తే ఆరోగ్యంగా ఉన్నారని, తగినంత నీరు తాగుతున్నారని అర్థం. లేత పసుపు రంగు వస్తే సాధారణ స్థితి అని, ఆరోగ్యంగా ఉన్నట్లు సంకేతమని అని వివరించారు. ముదురు పసుపు రంగు వస్తే నీరు తక్కువగా తాగుతున్నారని, మరి కొంత నీరు శరీరానికి అవసరమని అర్థమని పేర్కొన్నారు. తేనె రంగులో వస్తే శరీరానికి సరిపడినంత నీరు అందడం లేదని, ముదురు గోధుమ రంగులో వస్తే వెంటనే ఎక్కువ నీరు తాగాలని విద్యార్థులకు సూచించేలా పోస్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జపాన్‌కు చెందిన టోషికో మొరిమోటో, యాసుయో ఆబే, అమెరికన్ స్కాలర్స్ పటేల్ ఏఐ, లాస్ ఏంజిల్స్‌కు చెందిన బోర్డ్రుడ్ ఎల్‌జి, నెదర్లాండ్స్‌కు చెందిన డచ్ స్కాలర్స్ మెక్కీ టీఈ, ఫార్గ్ ఎస్ ఈటీ ఏఐ నిర్వహించిన పరిశోధనలు ఈ విధానం ఆవశ్యకతను నిర్ధారించాయని స్పష్టంచేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఎండ వేడిమికి విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పు నివారించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకు మూడు సార్లు (ఉదయం 9.45, 10.05, 11.50 గంటలకు) వాటర్ బెల్ మోగించాలని ఇప్పటికే విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ప్రవీణ్ ప్రకాశ్ గుర్తుచేశారు.

కాలువల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగాలి

అధికారులకు సీఎస్ ఆదేశం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో తాగునీటి అవసరాలకై ప్రకాశం బ్యారేజి, నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువల ద్వారా విడుదల చేసిన నీరు శివారు ప్రాంతాల వరకూ చేరే విధంగా ఆయా కాలువల వెంబడి గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సంబంధిత జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు,విద్యుత్ సరఫరా పరిస్థితులపై సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి ఆయన కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం ప్రకాశం బ్యారేజి నుండి రైవస్,బందరు, ఏలూరు కాలువ, కృష్ణా పశ్చిమ కాలువల ద్వారా ఎన్టిఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు...నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ నుండి పల్నాడు, ప్రకాశం, గుంటూరు,బాపట్ల జిల్లాల్లోని వివిధ సమ్మర్ స్టోరేజి ట్యాంకులను నింపేందుకు నీటిని విడుదల చేయడం జరిగిందని చెప్పారు. కాలువల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా మూడు నాలుగు రోజులు పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లు, జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. కాలువల వెంబడి నీటిపారుదల, రెవెన్యూ తదితర శాఖల సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి నీటిని చేపలు, రొయ్యల చెరువులకు అక్రమంగా మళ్లించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలను చైతన్యం చేయాలని చెప్పారు. 9వ తేదీ మంగళవారం శ్రీ క్రోధినామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ శ్రీ క్రోధి నామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

అసెంబ్లీలో ప్రజావాణి వినిపించేందుకు

సీపీఐ అభ్యర్థి 'బండి'ని గెలిపించండి

అక్కినేని వనజ

విశాలాంధ్ర ఏలూరు: సార్వత్రిక ఎన్నికలలో 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో 'ఇండియా' కూటమి తరపున సీపీఐ నుంచి బండి వెంకటేశ్వర రావును ఏలూరు అసెంబ్లీ అభ్యర్థిగా పరిచయం చేశారు. అనంతరం అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా పని చేస్తోందని విమర్శించారు. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రతిపక్ష నాయకులపై, మేధావులపై, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. మతతత్వ పార్టీ పాలనతో ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. బీజేపీ అత్యంత అవినీతి పార్టీ అని ఎన్నికల బాండ్ల ఉదంతం నిరూపించిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించకుండా మోదీ పాలనకు వంత పలుకుతున్నారని ధ్వజమెత్తారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సాధనకు కేంద్రాన్ని నిలదీయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గం సీపీఐ గెలిచిన చరిత్ర ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి ఈ.కిషోర్ మాట్లాడుతూ 'ఇండియా' కూటమిలో సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ బండి వెంకటేశ్వరరావు గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. సీపీఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో, ఏలూరు నియోజకవర్గంలో అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. కార్మికుల పక్షాన, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించి పరిష్కారం చేశామన్నారు. తనను సీపీఐ రాష్ట్ర సమితి, ఏలూరు జిల్లా సమితి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి అసెంబ్లీలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వాణి వినిపించడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని, కాంగ్రెస్ నాయకులు దండు బోయిన చంద్రశేఖర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మార్కుల స్కానింగ్ ప్రక్రియ పూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్ పరీక్షల మూల్యాంకనం, మార్కుల స్కానింగ్ ప్రక్రియ ముగిసింది. మార్చి ఒకటో తేదీ నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ వార్షిక పరీక్షలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు కలిసి పది లక్షలకుపైగా పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాలను ఈ నెల 15లోగా పూర్తి చేసేందుకు ఇంటర్మీడియట్ బోర్డు కసరత్తు చేస్తోంది. పూర్తయిన మూల్యాంకనం, స్కానింగ్ ప్రక్రియను మరోసారి పరిశీలించి, ఫలితాల విడుదలకు బోర్డు సిద్ధమవుతుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అనుమతులు వచ్చాక ఇంటర్ ఫలితాల విడుదల తేదీని అధికా రికంగా ప్రకటిస్తారు. ఇంటర్ విద్యార్థులకు ఇన్‌స్టెంట్ పరీక్షలను నిర్వహించే అవకాశముంది. మే 13 నుంచి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ఉన్నందున, అంతకు ముందస్తుగానే ఇంటర్ ఫలితాల విడుదలపై బోర్డు దృష్టి పెట్టింది. ఫలితాలు వేగవంతంగా విడుదలైతే, ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు సులభతరం అవుతుంది. ఏపీ ఈఏపీసెట్, జేఈఈ, నీట్ తదితర ప్రవేశాలకు వారికి సౌకర్యవంతంగా ఉంటుంది.

ఎస్ఐ, తహసీల్దార్‌ను నిందితులుగా చేర్చాలి

ఆదిమూలం కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం

షర్మిల, గాలి చంద్రను గెలిపించండి: ఓబులేసు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: భూ వివాదంతో పేరుతో ఆదిమూలం శ్రీనివాసులును చంపిన కేసులో ప్రధాన నిందితులు చిన్న పుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డిని తప్పించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు స్పష్టంచేశారు. ఈ కేసులో ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి, అప్పటి పెండ్లిమర్రి తహసీల్దారు ఉదయ భాస్కర్‌రాజులను నింది తులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో ఓబులేసు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం చిన్న సుబ్బరాయుడు భూమి వివాదంలో ఉందని, దీనిని పరిష్కరించాలని చిన్నసుబ్బరాయుడు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని చెప్పారు. చివరికి ఇది ఆదిమూలం శ్రీనివాసులు హత్యకు దారితీసిందని తెలిపారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి అనుచరులకు అప్పటి పెండ్లిమర్రి తహసీల్దార్ ఉదయ భాస్కర్‌రాజు, ఎస్ఐ సునీల్‌కుమార్ రెడ్డి తొత్తుగా వ్యవహరించడం వల్లనే ఈ దారుణం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో సామాన్యులకు ముఖ్యంగా వెనుకబడిన కులాల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కరువైందని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ముఖ్య అనుచరులే భూ కబ్జాలకు పాల్పడటం, ఎదురు తిరిగితే దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం, అప్పటికీ వినకపోతే అత్యంత కిరాతకంగా చంపడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. భూ వివాదానికి సంబంధించి చిన్న పుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డి, వారి కుటుంబం నుంచి ప్రాణహాని ఉందని కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా ఈ కేసును సక్రమంగా విచారణ జరిపి నిందితులకు శిక్షపడేలా చేయాలని అధికారులను కోరారు. ఇప్పటికే ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు...ప్రధాన నిందితులు చిన్న పుల్లారెడ్డి, నాగ పుల్లారెడ్డిలను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఆదిమూలం చిన్న సుబ్బరాయుడుకు, ఆయన కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ గంగిరెడ్డి రక్తపు మరకలు తుడుస్తుంటే అవినాశ్‌రెడ్డి పక్కన ఉన్నట్లు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చెప్పారని, వివేకాను ఎవరు చంపారో ఈ మాటలు తేటతెల్లం చేస్తున్నాయని ఓబులేసు అన్నారు. దేశంలో బీజేపీ నియంతలా పాలన చేస్తోందని, ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై తప్పుడు కేసులు బనాయిస్తోందని విమర్శించారు. ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా ప్రతిపక్ష నేతలను జైలుకు పంపుతోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని, అలాంటి బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ ఓటమే లక్ష్యంగా ఏర్పడిన ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కడప ఎంపీ అభ్యర్థి షర్మిలారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్రను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా నాయకులు ఎల్.సుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, వి.గంగా సురేశ్, జి.వల్లరాజు, బి.వెంకట రాములు, భాగ్యలక్ష్మి, పి.మల్లికార్జున పాల్గొన్నారు.

'ఇండియా' అభ్యర్థులను గెలిపించండి

రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతు ఆనందంగా ఉంటేనే దేశం సుభిక్షింగా ఉంటుందని, మోదీ అధికారంలోకి వచ్చాక అన్నదాతల పరిస్థితి దుర్భరంగా మారిందని దుయ్యబట్టారు. రైతాంగ సమస్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నా... బీజేపీ తమ అధికార బలంతో వాటిని అణిచివేస్తున్నారన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పి రైతులను కేంద్రం మోసగించిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ, కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టం, కనీస మద్దతు ధర పెట్టాలన్నారు. రైతుల ఉద్యమం న్యాయబద్ధమైనదని, రైతు సమస్యలన్నిటికీ అంగీకరించి ఎన్నికల ప్రణాళికలో పెడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. వాటిని పరిగణలోకి తీసుకుని రైతులు, రైతు కూలీలు, కార్మిక సంఘాలు... ఇండియా కూటమి దాని మిత్రపార్టీల అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్ మద్దతిస్తుందన్నారు. మత ప్రతిపాదికన బీజేపీ ఓట్లు అడుగుతుందని, రాష్ట్ర హక్కులు హరిస్తున్న బీజేపీకి దాని మిత్రపక్షాలకు ఓటు వేయవద్దని కోరారు. 'మోదీ హటావో దేశ్ బచావో' అని పిలుపు నిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో రైతాంగ ఉద్యమాలను చిన్నచూపు చూస్తూ ఆందోళనకు దిగిన అన్నదాతలను అణిచివేస్తు న్నారని మండిపడ్డారు. బీజేపీకి తొత్తుగా మారిన వైసీపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలన్నారు. వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ 2020 బిల్లును వెనక్కి తీసుకోవాలన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతు నాయకులు ఎమ్.కృష్ణయ్య, మలినీడి యలమందరావు, ఎస్.మనోరమ, సిహెచ్.రంగారావు, ఎమ్.హరిబాబు, ఎమ్.ప్రసాద్‌బాబు, పి.మురళీకృష్ణ, డి.హరనాథ్, రాజగోపాలరెడ్డి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే రూ.4 వేల పింఛన్

ఈసీ మొట్టినా... సచివాలయాల చుట్టూ తిప్పారు: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినా లబ్ధిదారులను సచివాలయాల చుట్టూ తిప్పారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావాలనే వైసీపీ నేతలు పింఛన్‌దార్లతో ర్యాలీలు చేయించారని, వృద్ధులు, దివ్యాంగులను మండుటెండలో రోడ్లపై ఊరేగింపు చేశారని, వలంటీర్లు లేకపోతే అసలు ప్రభుత్వ యంత్రాంగం ఏమీ చేయలేదనేలా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ మొట్టికాయలు వేయడంతో సచివాలయ సిబ్బందితో రెండు రోజుల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తి చేశారని, అదే పని ముందే ఎందుకు చేయలేదు అని ప్రశ్నించారు. రూ.13 వేల కోట్ల ప్రభుత్వ నిధులు సొంత వారికి దోచిపెట్టడంతో ఖజానాలో నిధులు లేకపోవడం వల్లనే ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వలేదన్నారు. మూడో తేదీన అప్పు తెచ్చి నాలుగున పింఛన్ల పంపిణీ ప్రారంభించారని తెలిపారు. అనారోగ్యంతో చనిపోయిన వృద్ధురాలితో జగన్ రాజకీయం చేయబోతే ప్రజలు చీవాట్లు పెట్టి మంత్రి జోగి రమేశ్‌ను తరిమికొట్టారని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏప్రిల్, మే, జూన్ నెలల పింఛన్‌ను పెంచిన రూ.నాలుగువేలతో కలిపి జులైలో రూ.7,000 ఇంటి వద్దనే అందిస్తామని వివరించారు. దర్శిలో పింఛన్‌దారులతో ముఖ్యమంత్రి డ్రామా ఆడించారన్నారు. అధికారంలోకి రాగానే రూ.3,000 పెన్షన్ ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక వాయిదాలు పెట్టి ఒక్కో పింఛన్ దారుడికి రూ.32 వేలు ఎగ్గొట్టారని ఆరోపించారు. చంద్రబాబు ధరలు పెంచకుండా రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.రెండు వేల చేశారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చే నాటికి 39 లక్షల పెన్షన్లు ఉంటే, ఐదేళ్లలో 21 లక్షల కొత్త పెన్షన్లు ఇచ్చి 2019 నాటికి 54.25 లక్షలకు చేర్చారని చెప్పారు. కొత్తగా కిడ్నీ, తలసేమియా, హిజ్రా, మత్స్యకారులు, కల్లుగీత, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మ కారులకు పెన్షన్లు అమలు చేసి ఆర్థికంగా తోడ్పాటు అందించటం జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వం తిరిగి రాదని తెలిసి ఆయన ఒత్తిడి చేసినా 97 శాతం వలంటీర్లు రాజీనామా చేయమని అడ్డం తిరిగారని చెప్పారు. జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ 'జంగా'పై శాసనమండలి చైర్మన్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిపై అనర్హత వేటు వేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజుకు ఆదివారం వైసీపీ శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఇటీవల వైసీపీ ఎమ్మెల్సీ కృష్ణమూర్తి టీడీపీలో చేరారు. ఆయన ఎమ్మెల్యే టికెట్ ఆశించగా, అందుకు అధిష్టానం నిరాకరించింది. వైసీపీలో సుదీర్ఘ కాలం పనిచేసిన జంగాకు రెండు విడతలుగా ఎమ్మెల్సీ పదవులను ఇచ్చింది. ఆ పార్టీలో బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగానూ కొనసాగారు. పార్టీ నుంచి టికెట్ లభించక పోవడంతో రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కృష్ణమూర్తిపై అనర్హత వేటు వేయాలని శాసన మండలి చైర్మన్‌కు వైసీపీ ఫిర్యాదు చేసింది. ఇంతకుముందు వైసీపీ ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, సి.రామచంద్రయ్యపైనా ఫిరాయింపుల చట్టంపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన రామచంద్రయ్య టీడీపీ, వంశీకృష్ణ యాదవ్ జనసేనలో చేరారు. ప్రస్తుతం ముగ్గురు ఎమ్మెల్సీలు వైసీపీని వీడారు.

సంపాదకీయం

మోదీ ఆత్మ స్తుతి-పరనింద

ఆత్మ స్తుతి పరనింద ప్రధానమంత్రి మోదీకి చాలా ఇష్టమైన క్రీడ. కాంగ్రెస్ శుక్రవారం విడుదల చేసిన ఎన్నికల ప్రణాళిక ముస్లిం లీగ్ సిద్ధాంతంలా ఉంది అని మోదీ విమర్శించారు. ఆ ప్రణాళికలోని ప్రతి పేజీ దేశాన్ని ముక్క ముక్కలుగా చీల్చడానికి ఉద్దేశించిందేనని ఆయన అన్నారు. ఎన్నికల ప్రణాళికలు కేవలం ఒక తంతుగా మిగిలిపోయాయి. అయినా కాంగ్రెస్‌ను దుయ్యబట్టడానికి అందులో బోలెడంత సమాచారం కనిపించింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక అబద్ధాల పుట్ట అని ఆయన నిందించారు. శనివారం ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్ పూర్‌లో ఓ ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక అచ్చం ముస్లింలీగ్ సిద్ధాంతాలకు అనుగుణంగానే ఉంది అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక స్వాతంత్ర్యానికి ముందు ముస్లిం లీగ్ భావన లాగే ఉంది అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో పేదల అవసరాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చెప్తూనే తన ఆత్మ స్తుతీ దండిగానే చేసుకున్నారు. కాంగ్రెస్ లూటీకి అడ్డుకట్ట వేసింది తనేనన్నారు. ఏప్రిల్ 19న పోలింగ్ జరగవలసిఉన్న చత్తీస్‌ఘడ్‌లోని బస్తర్‌లోనూ సోమవారం ఆయన కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో లోపాలు ఎన్నడంతోనే సరిపెట్టుకున్నారు. కాంగ్రెస్ హయాంలో భారత్ అవినీతికి ప్రతీకగా మారిపోయిందని, లూటీ చేయడానికి లైసెన్సు ఉండేదని అన్నారు. పేదల బాధ కాంగ్రెస్‌కు ఎన్నడూ అర్థం కాలేదని ఎత్తి పొడిచారు. కరోనా మహమ్మారి పంజా విసిరినప్పుడు పేదల గతి ఏమవుతుందన్న తీవ్ర ఆందోళన వ్యక్తమైనప్పుడు "నేను వారికి టీకా లిప్పించాను, రేషన్ అందించాను" అన్నారు. టీకా తయారు చేసింది ఆయనే అయినట్టు, ఆహార ధాన్యాల సరఫరా తన జేబులోంచి తీసి ఇచ్చినట్టు మోదీ మాట్లాడుతున్నారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయట పడ్డారు అని చెప్పినప్పుడు మాత్రం "మా ప్రభుత్వం" అన్నారు. మిగతాదంతా ఆయన ఘనతే. అవినీతివల్ల ఎక్కువగా నష్టపోయేది పేదలేనని చెప్పారు. "అవినీతి పేదల హక్కులను కాజేస్తుంది. 2014 కు ముందు లక్షలాది కోట్ల కుంభకోణాలు జరిగాయి. ప్రభుత్వం విడుదలచేసే సొమ్ములో 85 శాతం దారి మళ్లుతోంది, ప్రజలకు అందేది కేవలం పదిహేను శాతమేనని రాజీవ్ గాంధీ అన్నారు" అని చెప్తూ రాజీవ్ మాటలను వాటంగా తన అసత్య ప్రచారానికి వినియోగించుకున్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరవాతే ప్రభుత్వం అందించే ప్రతి పైసా పేదలకు అందుతోందట. గత పదేళ్ల కాలంలో రూ.34 లక్షల కోట్లు పేదలకు అందించింది తానేనట. కాంగ్రెస్ అధికారంలో ఉంటే మొత్తం 34 కోట్లలో 28 కోట్లు ఆ పార్టీ అవినీతి ఖాతాలో పడిపోయేవని దెప్పి పొడిచారు. కాంగ్రెస్ నాయకుల లూటీని అంతం చేస్తుంటే తనను దూషిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆ మధ్య పార్లమెంటులో మాట్లాడుతూ "వాళ్లు అంత మంది. నేనొక్కణ్నే. నా ఒక్కడి మీద ఇంత మంది దాడి చేస్తున్నారు" అని ఏడ్చినంత పని చేశారు. ప్రతిపక్షాల విమర్శనాస్త్రాలను ఎదుర్కోవడానికి ప్రజా మద్దతు తనకు డాలులా ఉపకరిస్తోందట. మోదీ నోరు తెరిస్తే స్వీయ కీర్తి గానంలోనే కాలం గడిపేస్తారు. "బెదిరింపులకు నేను భయపడను. ఇండియానే నా కుటుంబం. నా దేశాన్ని రక్షించడమే నాకు సరిపోతోంది. లూటీ నుంచి నా కుటుంబాన్ని రక్షించడమే నాపని. నేను అవినీతిపరులను తొలగించండి అంటే వాళ్లు అవినీతిపరులను కాపాడండి అంటారు" అని మోదీ ఆరోపణ తానేచేసి జవాబూ తానే చెప్తారు. కాంగ్రెస్, ప్రతిపక్షాల ర్యాలీలు అవినీతి పరులను కాపాడడానికేనట. తనను ఎంత బెదిరించినా అవినీతిపరులు జైలుకెళ్లడం ఖాయం అని మోదీ తన భవిష్యత్ కార్యాచరణను ఆవిష్కరిస్తున్నారు. "ఇది మోదీ గ్యారంటీ" అంటున్నారు. మోదీ గ్యారంటీ అన్న మాటే తప్ప బీజేపీ, ప్రభుత్వ ప్రస్తావన ఎక్కడా ఉండదు. మంచంతా తన పంచల్లోనే ఉంటుందని మోదీ భావిస్తారు. గత రెండు మూడు రోజుల ఎన్నికల ప్రచార సభల్లో మోదీ శ్రీ రామ నవమి ప్రస్తావన తీసుకురావడంలో హిందుత్వ ఆధారంగా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం బహిరంగంగానే కనిపిస్తోంది.

కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక ఆసరాగా మోదీ విమర్శనాస్త్రాలను విశ్లేషించాలంటే ఆయన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ఎన్ని అవినీతి ఆరోపణలను దేశ భద్రత పేరు చెప్పి గంప కింద కమ్మేశారో గమనించాల్సిందే. రాఫెల్ లాంటి అతి పెద్ద కుంభకోణంలోనే దేశ భద్రత పేరు చెప్పి సుప్రీంకోర్టు కూడా ఆ వ్యవహారాన్ని విచారించకుండా అడ్డు తగులుతున్నారు. తామే అవినీతి పరులని ముద్రవేసి నానా హడావుడిచేసి ఆ ప్రతిపక్ష నేతలందరినీ కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో దాడి చేయించి బీజేపీలో చేర్చుకున్న విషయాన్ని మోదీ సులభంగా విస్మరించగలరు. అధికారంలోకి వచ్చి పదేళ్లయినా మోదీ కాంగ్రెస్‌ను, ఇతర ప్రతిపక్ష పార్టీలను తప్పు పట్టడం మానలేదు. ఈ పదేళ్ల కాలంలో సాధించిందేమీ లేనందువల్ల ఓటమి భయం మోదీని వెంటాడుతూనే ఉంది కనక నోరుపారేసుకుంటున్నారు. సకల నియమాలను తుంగలో తొక్కుతున్నారు. తమ ఎన్నికల ప్రణాళిక ముస్లింలీగ్ భావజాలానికి ప్రతిరూపంగా ఉంది అని మోదీ విమర్శించినందుకు కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ వ్యవహారసరళి చూస్తే ఈ ఫిర్యాదు పోస్టు చేయని ఉత్తరంగా మిగిలిపోక తప్పదేమో! ఎన్నికల ప్రణాళిక బీజేపీకి ఒక తంతుగానైనా మిగలలేదు. 2019 సార్వత్రిక ఎన్నికలు ఒక విడత పూర్తి అయిన తరవాత బీజేపీ ఎన్నికల ప్రణాళిక విడుదల చేసింది. ఈ సారీ ఎన్నికల ప్రణాళిక రూపొందించడానికి కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నాయకత్వంలో 27 మందితో ఓ కమిటీ గత వారం ఏర్పాటు చేశారు. మొదటి దశ పోలింగ్ నాటికి ఆ ప్రణాళిక విడుదలైతే అక్కడికదే గొప్ప. అయినా ఎన్నికల ప్రణాళికతో మోదీకేం పని? ఆయన నోటి నుంచి వెలువడ్డ ప్రతి మాటా ఎన్నికల ప్రణాళికే. బీజేపీ 370 స్థానాలు సాధిస్తుంది, ఎన్.డి.ఎ. 400 సీట్లలో విజయం సాధిస్తుందిలాంటి ప్రగల్భాలన్నీ ఎన్నికల ప్రణాళికలే అనుకోవాలి. బీజేపీ ఎన్నికల ప్రణాళిక రూపొందించడానికి రాజ్‌నాథ్ సింగ్ నాయకత్వంలో 27 మందితో కమిటీ నియమిస్తే అందులో సమన్వయ కర్త, సహ సమన్వయ కర్త మినహా అందరూ రాజకీయంగా అనేక మందిని సంతృప్తి పరిచే ప్రయత్నమే కనిపిస్తుంది. అందులో మౌలిక సదుపాయాల కల్పనకోసం విశేష కృషి చేశాడంటున్న గడ్కరి పేరు లేదు. అలాగే బీజేపీ హిందుత్వ రాజకీయాలకు ప్రతీక అయిన యోగీ ఆదిత్యనాథ్ పేరు కూడా లేదు. కానీ ఆదిత్యనాథ్ కు ప్రత్యామ్నాయ నాయకుడనుకుంటున్న రాధా మోహన్ సింగ్ పేరు మాత్రం ఉంది. ఎన్నికల ప్రణాళిక మోదీ హయాంలో ఓ తంతు మాత్రమే.

జవాబు లేని ప్రశ్న

చింతపట్ల సుదర్శన్

పొద్దు గూట్లో పడే టైం అయింది. వెనుకటి రోజుల్లో ఎక్కా బుడ్డీలు, కందిలీలు వెలిగించే టైం. ఇప్పుడైతే ఎల్‌ఈడీలు వెలిగించే టైం. అరుగుమీద తీరిగ్గా కూచున్నాయి డాంకీ, డాగీ. కళ్లు మూసుకుని మెడిటేషన్ చేస్తున్నది డాంకీ. తోకతో విన్యాసాలు చేయిస్తున్నది డాగీ. ఉన్నట్టుండి లేచి నిలబడ్డది డాగీ. మొహం మీద చెవులు, వీపు మీద తోకా నిలబెట్టి 'రీ సౌండు' వచ్చేట్టు 'భవ్వ' మనసాగింది. ధ్యానం భగ్నంఅయి ఉలిక్కిపడి కళ్లు తెరిచింది డాంకీ. ఎమొచ్చిందోయి నీకు ఉన్నట్లుండి తోక తొక్కిన కుక్కలా అరుస్తున్నావు అంది డాంకీ. ఒక్క క్షణం 'భవ్వ'ను ఆపి అటుచూడు ఆ వెళ్లున్నవాడ్ని గుర్తుపట్టి అరిచి చస్తున్నా అంది డాగీ. ఎవరతను? కార్పొరేటరా, ఎంఎల్‌ఏనా మరో పెద్ద తలకాయా అంది డాంకీ. ఆళ్లెవరూ కాదు. గుడి దగ్గర అడుక్కునే బిచ్చగాడు. వాడ్నిచూసి 'భవ్వ' అనకుండా ఉండలేక 'భవ్వ' మంటున్నా. మీ కుక్కలకిదేం బుద్ధి. బిచ్చగాళ్లనూ, రోడ్డుమీద ప్లాస్టిక్ సీసాలు, పేపర్లూ కవర్లూ ఏరుకునే వాళ్లనూ చూస్తే అస్సలు సహించరు అంది డాంకీ. అవును. మాకు వాళ్లు దొంగల్లా కనిపిస్తారు మరి. అడుక్కునే వాళ్లందరూ దొంగలేనా? ఎన్నికలప్పుడు ఓట్లు అడుక్కునే వాళ్లూ దొంగలేనా? ఆళ్లూ దొంగలే ఈళ్లూ దొంగలే. వాళ్లని చూసి అరవలేం, కనుక వీళ్లనుచూసి ఆరుస్తాం. అసలు మన ఘనమైన దేశంలో దొంగలేతప్ప దొరలే తప్ప బిచ్చగాళ్లు ఉండరుగాక ఉండరు. బిచ్చగాళ్ల వేషంలో ఉండేవాళ్లంతా

రంగస్థలం

దొంగలే అంది డాగీ. ఆ మాట ఎలా అనగలవు. పాపం నిజంగానే తిండికి వాచిపోయిన ముఖాలెన్నిలేవు? ఎలా ఉంటాయి. మన దేశం ప్రపంచ దేశాలలో 'అయిదవది' అంటున్నారు. అయిదుదాకా లాక్కువచ్చిం దాన్ని 'మూడు'ని చేస్తామంటున్నారు. ఇంత గొప్ప దేశంలో బిచ్చగాళ్లసలు ఉంటారా? ఉండరు గాక ఉండరు? ఉంటేగింటే దొరల వేషంలోనే బెగ్గర్ కాస్ట్యూమ్‌లో బిచ్చగాళ్లు గానో ఉంటారంతే అంటూ 'భవ్వ' రాగం అందుకుంది మళ్లీ డాగీ. ఏమరుస్తావు లెద్దూ! వాడెప్పుడో రోడ్డెక్కేడు అంటూ అరుగెక్కాడు అబ్బాయి. డాగీ అరుపు ఆపి అబ్బాయి చుట్టూ ఓ రౌండేసి తన జాగాలో కూచుంది. సాయంత్రం అయింది గదా కాసేపు ప్రశాంతంగా కళ్లు మూసుకుందామనుకుంటే ఈ గ్రామసింహం 'భౌభౌ' రాగం ఎత్తుకుంది అంది డాంకీ. అక్కడికి ఈ ఊళ్లో నేనొక్కడ్నే అరుస్తు న్నట్టు దేశం నిండా అరుపులే! తాట తీసేవాళ్లు, నాలుక కోసేవాళ్లు అరిచే అరుపుల కంటేఎక్కువేం కాదు మాకుక్కల అరుపులు అంది డాగీ. అరిచే కుక్కలూ, మనుషులూ కరిచేదే లేదు కానీ తమ్ముడూ నీ సంగతిచెప్పు. ఈ ఎన్నికలకయినా నీకు 'అచ్చేదిన్' వచ్చేది ఉందంటావా? అంది డాంకీ. చచ్చేదిన్ కంటే ముందు అచ్చేదిన్ చూస్తానో లేదో కానీ కొత్త సంవత్సరం అయితే వస్తున్నది అన్నాడబ్బాయి. ఆ వచ్చేది కొత్త సంవత్సరం అయితే వస్తున్నది అన్నాడబ్బాయి. ఆ వచ్చేది ఏ సంవత్సరం 'బ్రో' అనడిగింది డాగీ. దాన్ని 'క్రోధి' అంటారు. క్రోధి అంటే కోపిష్టిది అని అర్థం అని వివరించాడు అబ్బాయి. అనుకుంటూనే ఉన్నా పేపర్లనిండా మన నేతల కోపం కట్టలు తెంచుకుంటున్నది. కోపం కారణంగా నాలుకలు అన్ని హద్దులూ మర్చిపోతున్నవి. ఇక ఈ కోపగొండి ఏడాదంతా విశ్వా మిత్రులూ, దుర్వాసులూ విజృంభిస్తా రన్నమాట అంది డాంకీ. తన కోపమే తన శత్రువు అనే పద్యం అందరికీ కంఠతా వచ్చేట్టు చెయ్యాలి.ఆ సంగతి వదిలెయ్యి. ఎన్నికలయ్యాక అంతా మంచే జరుగుతుందంటు న్నారు. పాంచ్ న్యాయ్ పచ్చీస్ గ్యారంటీ కరపత్రాలు ఇంటింటికీ పంచి ఘర్ ఘర్ గ్యారంటీని గ్యారంటీగా ఇస్తున్నారు అంది డాంకీ. అయిన దేమో అయినది ఇక లక్షల్లో ఉద్యోగాలంటున్నారు. ఈ సారి పేపరు లీక్ కాకుండా ఉంటే, కోర్టులు అడ్డకాలు వెయ్యకుండా ఉంటే నీకు ఉద్యోగం గ్యారంటీ 'బ్రో' బాగా చదివి, దేనికైనా రెడీగా ఉండు అంది డాగీ. రాతా గీతా సరిగ్గాలేక ఇలా ఉన్నావు కానీ 'బ్రో నువ్వు చాలా 'స్మార్ట్ గురూ' అనాలి నిన్ను. అయితే అన్నా నేనడుగుతాను చెప్పు మద్యపాన నిషేధం ఏమైంది? అంది డాగీ యూపీఎస్సీ మెంబర్లా ముఖం సీరియస్‌గా పెట్టి. మద్యపాన నిషేధం నిషేధించబడింది. మద్యం లేకుంటే సర్కార్లు నిలబడవు. మద్యం పాలసీ ముఖ్యమంత్రిని కూడా జైలుపాలు చెయ్య గలదు. బెల్టు షాపులు గవర్నమెంటు షాపులుగా మార్చ వచ్చు. కొత్త పేర్లూ, బ్రాండ్లూ తాగుబోతుల్ని 'చెడ్డీ' మీద నిలబెట్టగలవు. ఇలా చెప్తు కుంటూ పోతుంటే మధ్యలో అందుకుంది మరో సభ్యుడిలా డాంకీ. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఎందుకు అందడంలేదు. ఉన్నడబ్బంతా ఉచితాలకు ఖర్చుపెట్టే ప్రభుత్వాలు ముందు ముందు జీతాలు, పెన్షన్లూ ఇవ్వలేక ఉద్యోగులనే, పనికి ఇంతని వసూలు చేసుకో మనే పరిస్థితి రావచ్చు అని జవాబిచ్చాడు అబ్బాయి. బాగా చెప్పావు కానీ దీనికి చెప్పు ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర ఏమిటి? కాలం మారింది. ప్రభు త్వాలు ప్రతిపక్షాలను 'హాంఫట్' అని మాయం చేసే పనికి పూనుకుంటు న్నవి. బెల్లం చుట్టూ ఈగల్లా అధికారం ఎక్కడ ఉందో అక్కడికే చేరు కుంటున్నారు కొందరు స్వార్థ రాజకీయ నాయ కులు. ప్రతిపక్షాలే లేని నాడు వాటి పాత్రా లేద గోచీ లేదు అన్నాడు అబ్బాయి. చివరగా నాదో ప్రశ్న దీనికి జవాబు చెప్తే ఉద్యోగం గ్యారం టీగా వస్తుంది అంది డాగీ. ప్రత్యేక హోదా గురించయితే అడక్కు ఏ కేసులూ తలమీద లేని నాయ కుడు ఏలికైతే తప్ప అది సాధ్యం కాదు అన్నాడబ్బాయి. అదేం కాదు. ఈజీ క్వశ్చిన్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఏది? ఇది ఈజీ క్వశ్చిన్ కాదు. ఉద్యోగం ఇవ్వకుండా పంపే జటిలమైన ప్రశ్న. అంతూ లోతూ తెలీని ప్రశ్న తేలని ప్రశ్న. బేతాళ కథలో విక్ర మార్కుడికి కూడా దీనికి జవాబు తెలియదు. పొద్దుపోయింది వస్తానంటూ అరుగుదిగాడు అబ్బాయి. డాగీనైతే యేం? జవాబు తెలీని ప్రశ్న అడగగలిగాను అంది డాగీ హుశారుగా!

పదేళ్లలో నాశనమైన వ్యవసాయం

కె.వి.వి. ప్రసాద్

భారత పార్లమెంటుకు, మన రాష్ట్ర శాసనసభకు మే 13న జరిగే ఎన్నికలకు రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. రాష్ట్రంలో రైతాంగ స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని ప్రతి రాజకీయపార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో రైతాంగ శ్రేయస్సు దృష్ట్యా వ్యవసాయరంగానికి ప్రాధాన్యత కల్పించాలి. మన దేశ ఆర్థిక, సామాజిక నిర్మాణంలో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది. దేశ జనాభాలో 48.6శాతం ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశంలో ఉన్న 14.58 కోట్ల రైతు కుటుంబాల చేతుల్లో 38.82 కోట్ల ఎకరాల సాగుభూమి ఉన్నది. సుమారు 7 కోట్ల మంది ఏ మాత్రం భూమిలేని నిరుపేద దళితులు, గిరిజనులు, మైనారిటీలు, బి.సీ.లు కౌలు రైతులుగా జీవనం సాగిస్తున్నారు. వీరే కాకుండా అనుబంధ రంగాలైన పశుపోషణ, పౌల్ట్రీ, ఆక్వా, ఫిషరీస్ తదితర రంగాలపై ఆధారపడినవారు పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పాలకుల విధానాల ఫలితంగా రైతు తన భూమిలోనే కూలీగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

77 సంవత్సరాల స్వాతంత్రానంతరం బీజేపీ ప్రభుత్వ విధానాలవల్ల ఆర్థిక అసమానతలు పెరిగిపోతూ ప్రపంచ ఆకలిసూచిలో 125 దేశాలకుగాను 111వ స్థానానికి మనదేశం దిగజారింది. దీంతో పేదలు ఆకలి చావులకు, రైతుల ఆత్మహత్యలకు గురవుతున్నారు. 15 కోట్ల మంది నిరుపేదలు ఒక్క పూట తిండికికూడా నోచుకోవడం లేదు. ప్రధాని స్వంత రాష్ట్రం గుజరాత్‌లో 38శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. మరో ప్రక్క ఆర్థిక అసమానతలలో మనదేశం 157 దేశాల్లో 129వ స్థానంలో ఉన్నది. 122 దేశాల నీటి నాణ్యత సూచిలో 120వ స్థానానికి దిగజారింది. స్వచ్ఛమైన గాలి అందించే దేశాల పరిశీలనలో 180 దేశాల్లో 179వ స్థానంలో మనం ఉన్నాము. సంతోషసూచిలో 156 దేశాల్లో 144వ స్థానాన్ని, పత్రికా స్వేచ్ఛలో 180 దేశాల్లో 140వ స్థానాన్ని, పర్యావరణ పరిరక్షణలో 187 దేశాలకుగాను 167వ స్థానానికి దిగజారిందంటే మన దేశం ఆయా రంగాలలో ఎంత వెనకబడి ఉన్నదో అవగతమౌతున్నది. రైతులు గౌరవప్రదంగా కుటుంబ అవసరాలు తీరేలా ఉండాలంటే సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి చట్టబద్ధ మద్దతు ధరలు నిర్ణయించాలని డా.యం.యస్.స్వామినాథన్ కమీషన్ 2006లో సిఫారుసు చేసింది. నేటికి ఆ సిఫారుసులు అమలు కాకపోవడంతో రైతాంగం ప్రతి సంవత్సరం సుమారు 3 లక్షల కోట్లు నష్టపోతున్నారు. పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులకనుగుణంగా మద్దతు ధరలు పెరగకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ళతో పంట నష్టాలు, రుణాలు సక్రమంగా అందక అధిక వడ్డీల భారం, పంటల బీమా వర్తించకపోవడం తదితర కారణాలవల్ల రైతాంగ ఆదాయం తగ్గిపోతున్నది. ఫలితంగా వ్యవసాయ రంగ ప్రభావంతో గ్రామీణ ప్రజలు, చేతివృత్తిదారులు, నిరుపేదలు ఆకలితో అలమటించే పరిస్థితి ఏర్పడుతోంది. వ్యవసాయ సంస్కరణల ప్రభావంతో గత 25 సంవత్సరాల కాలంలో సుమారు 4 లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలపాలయ్యారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు కల్పిస్తామని రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేస్తామన్న మోదీ ప్రభుత్వ హయాంలో సుమారు లక్షన్నర మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే నేటి వ్యవసాయరంగ దుస్థితికి అద్దం పడుతున్నది. వ్యవసాయం గిట్టుబాటుకాక ప్రతి రోజూ సగటున 2400 మంది రైతులు వ్యవసాయాన్ని వదిలి ఇతర వృత్తుల్లోకి వెళుతున్నారు. ప్రతిరోజూ 30 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి రైతుకుటుంబంపై సగటున 74 వేల రూపాయల రుణభారం ఉన్నది. 1950 దశకంలో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల సగటు ఆదాయ నిష్పత్తి 1:2 ఉండగా ప్రస్తుతం ఈ వ్యత్యాసం 1:12కు పెరిగింది. 2000 సంవత్సరం నుండి 2017 వరకు మద్దతు ధరలు

సక్రమంగా లభించని కారణంగా మన దేశ రైతాంగం 45 లక్షల కోట్లు నష్టపోయినట్లు ఐ.సి.ఎ.ఐ.ఆర్. నివేదిక స్పష్టం చేసింది. ఇదిలాఉండగా వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్ర నష్టదాయకంగా కేంద్రం రూపొందించిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు (1)రైతుల ఉత్పత్తి- వ్యాపారం-వాణిజ్య చట్టం-2020, (2) రైతులకు ధరల హామీ - వ్యవసాయ సేవల ఒప్పంద చట్టం-2020, (3) నిత్యావసర సరుకుల (సవరణ) చట్టం - 2020, విద్యుత్ బిల్లు- 2020 రద్దు చేయాలని డా.ఎం.ఎస్. స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం (సి2౦50%) చట్టబద్ధ ఎమ్ఎస్‌పీ నిర్ణయించా లని, ఒక్క పర్యాయం పంట రుణాలు మాఫీ చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టం చేయాలన్న రైతాంగ డిమాండ్లను ఆమోదించి లిఖితపూర్వక హామీ ఇచ్చిన కేంద్రం నేటికి అమలు చేయకుండా మోసం చెయ్యడంతో దేశవ్యాప్తంగానూ, ఢిల్లీ సరిహద్దుల్లోనూ మరో మారు రైతాంగం ఉద్యమించక తప్పలేదు. రైతాంగంపట్ల, ప్రజలపట్ల దుర్మార్గంగా, నిర్లక్ష్యంగా ఉంటూ పేదరికాన్ని పెంచి పోషిస్తూ కార్పొరేట్ ఆస్తుల పెంపునకు నిస్సుగ్గుగా దోహద పడుతున్న బీజేపీ మరోమారు అధికారంలోకి రాకుండా నిరోధించాలి. రైతు వ్యతిరేక చట్టాలు, విధానాలు రూపొందించి నేటి వ్యవసాయరంగ దుస్థితికి కారణమైన మోదీ విధానాలకు రాష్ట్రంలోని అధికార వైసీపీ, ప్రతిపక్ష తెలుగు దేశం వత్తాసు పలుకుతూ "దూడూ బసవన్నల" మాదిరి వ్యవహరిస్తున్నాయి. 65శాతం జనాభా ఉన్న రాష్ట్రంలో వ్యవసాయరంగంపై ఆధారపడ్డారు. సుమారు 76.24 లక్షల వ్యవసాయ కమతాలు ఉన్నాయి. 136 రకాల పంటలు మన రైతాంగం పండిస్తున్నారు. వ్యవసాయరంగంలో మార్పులతో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సాగుభూమిలో 70శాతం, సాగుదారులుగా 80శాతం ఉన్న కౌలు రైతుల సంక్షేమానికి చట్టాలు చేసినా అమలులో చిత్తశుద్ధి కొరవడింది. కౌలు రైతుల ఆత్మహత్యలలో మన రాష్ట్రం 2వ స్థానంలో ఉన్నదంటే పాలకుల నైజం అర్థమవుతున్నది. పంటలకు గిట్టుబాటు ధరలులేక, ప్రభుత్వాల ప్రోత్సాహాలు లభించక రైతాంగం అప్పుల భారంతో సత మత మౌతున్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై 2.45 లక్షల రుణభారం ఉన్నది. అప్పులు తీరే దారిలేక చివరకు ఆత్మహత్యలే శరణ్యంగా రైతాంగం భావిస్తున్నారు. రైతాంగ ఆత్మహత్యల్లో రాష్ట్రం 3వస్థానంలో ఉన్నది. మరోపక్క పర్యావరణ మార్పులతోపాటు మద్దతు ధరలు నోచుకోక రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాక నీటి సదుపాయం అందక ఏ ఏటికాఏడు పంటలసాగు తగ్గిపోతున్నది. తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు మైక్రో ఇరిగేషన్ పథకాలకు నిధులు మంజూరుచేయక ఆ పథకాలు నిలిచిపోయాయి. పోలవరంతోపాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ముందుకుసాగక గత 5 సంవత్సరాలకాలంలో ఒక్క ఎకరా అదనంగా సాగు జరిగింది లేదు. అట్టహాసంగా 2020లో ప్రారంభించిన జలకళ పథకంలో బోర్లు వేయించుకునేందుకు 2,32,789 దరఖాస్తులు రైతాంగం చేసుకుంటే బోర్లు వేసింది మాత్రం కేవలం 23,115 మాత్రమే. బోర్లు వేసుకున్న రైతుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించింది 3,500 మందికి మాత్రమే. ఏతా వాతా జలకళ పథకం పూర్తిగా అటకెక్కింది. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన వివిధ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ కూడా ప్రభుత్వం ఇవ్వలేక సదరు పథకాలు రైతాంగానికి అందకుండా దుర్వినియోగం అయ్యాయి. అష్టకష్టాలు పడుతూ వ్యవసాయం చేస్తున్న రైతాంగాన్ని ఆదుకోవడంలోనూ తమ విధానాల కారణంగాను అప్పుల భారంతో ఉన్న రైతులకు రుణమాఫీ చేయడంలోనూ వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో రైతుల రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం 24,500 కోట్లు మాఫీ చేయడానికి సిద్ధపడి 15,000 కోట్లు మాత్రమే మాఫీ చేసి మిగిలిన 9,500 కోట్లు మాఫీ చెయ్యకుండా రైతాంగాన్ని మోసం చేసింది. రైతాంగాన్ని ఆదుకోవడంలో తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు ఒకరిని మించి ఒకరు మోసం చేస్తూనే ఉన్నారు. రాజధాని ప్రాంత రైతులు రాష్ట్ర విభజనతో రాజధాని నిర్మాణం కోసం సుమారు 30 వేల మంది 34,387 ఎకరాల భూములను భూ సమీకరణ చట్టం మేరకు ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజధానికి భూములిచ్చిన రైతు కుటుంబాల భవిష్యత్తు పశ్నార్థకమైంది. రాజధాని నిర్మాణం నిలిచిపోయింది. రాజధాని పరిరక్షణే లక్ష్యంగా భూములిచ్చిన రైతులు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ఈ దశలో రాష్ట్రంలో మే 13న జరిగే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల జెండాలు కాకుండా ప్రణాళికలకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చేలా ఒత్తిడి తేవాల్సిన ఆవశ్యకతను రైతాంగం గుర్తిం చాలి. రాజకీయ పార్టీలు మోసపూరితమైన హామీలు విడనాడి వ్యవసాయరంగ పురోభివృద్ధికి రైతుల ఆదాయం పెరిగే రీతిలో ప్రణాళికలు రూపొందించి చిత్తశుద్ధితో అమలుకు కృషి చేయాలి. ఇందుకోసం రైతాంగపక్షాన రైతాంగ అభి ప్రాయాలతో కూడిన ఈ క్రింది అంశాలను రాజకీయ పార్టీలు దృష్టిలో పెట్టుకొని తమరు రూపొందించే ప్రణాళికలో పొందుపర్చాలి.

ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి
సెల్: 9490952737

ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం

టి.వి.సుబ్బయ్య

చరిత్రలో మానవాళి క్లిష్ట దశలో పయనిస్తోంది. శాంతి, పురోగతి, స్వేచ్ఛ, సామరస్యం, మానవజాతి మనుగడ కోసం ప్రజాస్వామ్య వ్యవస్థలు తప్పనిసరి. అయితే ప్రపంచంలో అనేక దేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థల నుంచి ఇటీవల కాలంలో నియంతృత్వం వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. వీటిలో తేడాలున్నాయి. ఉదాహరణకు భారతదేశ ప్రజాస్వామ్యంలో నియంతృత్వం కొనసాగుతోంది. గత పదేళ్ల కాలంలో నియంతృత్వం వైపు క్రమంగా నడుస్తోంది. అన్ని వ్యవస్థలు, విలువలు దిగజారిపోతున్నాయి. ఒక మతం ఆధారంగా నియంతృత్వ పాలన కావాలని కేంద్ర పాలకులు కోరుకుంటున్నారు. ఏకవ్యక్తి పాలన కొనసాగుతోంది. ఆధునిక ప్రపంచంలో ప్రజాస్వామ్యం స్థానే నియంతృత్వ వ్యవస్థ తిరోగమనం వైపు వెళుతోంది. మత సామరస్యం విచ్ఛిన్నం చెందుతోంది. నియంతృత్వ దేశాలన్ని ఫాసిజం వైపు పరుగెడుతున్నాయి. ప్రజాస్వామ్యం కోరుకుంటున్న శక్తులు బలహీనపడు తున్నాయి. శాంతిని, సామరస్యతను కోరుతున్న శక్తులు బలహీనపడుతూ ప్రతిఘటించలేక పోతున్నాయి. భారతదేశంలో పరిస్థితి అర్ధ నియంతృత్వంలో ఉందని అనేకమంది చరిత్రకారులు, మేధావులు, సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మతం ఆధారంగా ఏర్పడిన దేశాలు ఎల్లవేళలా సంఘర్షణలు, అంతర్యుద్ధాలలో మనుగడ సాగిస్తున్నాయి. అనేక కారణాలు, పరిణామాల వల్ల సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచం పై పెత్తనం చెలాయి స్తున్నాయి. మతాలు, జాతుల మధ్య నిరంతరం అంత: ఘర్షణలు సాగుతు న్నాయి. భారతదేశంలో మెజారిటీ మత ప్రజల అండగా సర్వ వ్యవస్థలు వ్యక్తి పాలనలో భ్రష్టు పడుతున్నాయి. భారతదేశం ప్రజాస్వామ్యం క్షీణించిందని స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ నుంచి పనిచేస్తున్న వి-డెమ్ సంస్థ "ప్రజాస్వామ్య రిపోర్టు- 2024 విశ్లేషించింది. కేవలం ఎన్నికలు నిర్వహించినంత మాత్రాన అట్టి దేశంలో ప్రజాస్వామ్య సమాజం నెలకొని ఉందని చెప్పడానికి వీలులేదు. పౌర సమాజంలో అన్ని మతాలకు, జాతులకు శాంతియుత జీవనం ఉండాలి. జన్మించిన ప్రతివాడికి స్వేచ్ఛా జీవనం అవసరం. కానీ ఇవి రోజురోజుకు దిగజారిపోతున్నాయి. వాక్ స్వాతంత్ర్యం తప్పనిసరి. దానికీ సంకెళ్లు పడుతున్నాయి. ప్రతిపక్ష ముఖ్యమంత్రులూ అన్యాయంగా



జైళ్ల పాలవుతున్నారు. మేధావులను జైళ్ల పాలుచేసి విచారణ కూడా లేకుండా వేధిస్తున్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నికల బాండ్లను పథకాన్ని ప్రవేశపెట్టి రాజ్యాంగాన్ని ధిక్కరించిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏక వ్యక్తి పాలనలో ఇలాంటివి సాధారణం. ఎన్నికల బాండ్లు నల్ల ధనంతో కొనుగోలు చేశారు. ఇది పరస్పరం ఇచ్చిపుచ్చు కోవడమేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎవరితో సంప్రదించకుండా పెద్ద నోట్ల రద్దు, కరోనా ప్రారంభ దశలో లాక్‌డౌన్ ప్రకటన తదితర అనేక నిర్ణయాలు నియంతలు మాత్రమే చేసే పనులు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి జరగవు. ప్రజలు ఎన్నుకున్న చట్ట సభలలో చర్చించి నిర్ణయిస్తే దాన్ని ప్రజాస్వామ్యమని చెప్పవచ్చు. తూర్పు ఐరోపా, ఆసియా దేశాలు ప్రజాస్వామ్యం నుంచి నియంతృత్వం వైపు పరుగెడుతున్నాయి. ప్రపంచ జనాభాలో 5.7 బిలియన్‌ల ప్రజలు నియంతృత్వ దేశాల్లో నివసిస్తున్నారు. పదేళ్ల క్రితం కంటే నేడు నియంతృత్వంలోకి జారిన ప్రజలు 48 శాతం పెరిగారు. దాదాపు 60 దేశాలలో 2024 లో ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో 23 దేశాల్లో కేవలం ఎన్నికల ప్రజాస్వామ్యం నెలకొన్నది. ఉదాహరణకు భారతదేశం సైతం ఎన్నికలు నిర్వహణ ప్రజాస్వామ్య దేశంగా పరిగణించాలి. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు వీలవుతుందని కర్నాటకకు చెందిన బీజేపీ ఎంపీ ఒకరు అసలు విషయం వెల్లడించారు. ఎల్‌సాల్వడార్, ఇండియా, మారిషస్‌లలో ప్రజాస్వామ్యం వేగంగా నియంతృత్వ వ్యవస్థలోకి వెళ్లడానికి తహతహలాడుతున్నాయి. 2024 లో 31 దేశాల్లో ప్రజాస్వామ్య స్థాయిలు దిగజారుతున్నాయి. బ్రిటీష్ పాలన నుండి స్వాతంత్ర్యాన్ని సాధించడానికి సుదీర్ఘ కాలం భారతదేశ ప్రజలు దీర్ఘకాలం మహత్తర పోరాటం చేశారు. ఈ పోరాటంలో అనేక మంది తమ జీవితాలను అంకితంచేసి ప్రాణ త్యాగం చేశారు. మహత్తర పోరాటానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రు లాంటి నేతలను, స్వాతంత్ర్య పోరాటం ఎరుగని నేటి పాలకులు ఏ మాత్రం గౌరవించడం లేదు. వీరు రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్నారు. వీటిన్ని రద్దు చేసి నియంతృత్వంలోకి వెళ్లిపోయేందుకు అనేక ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలు తీసుకుంటున్నారు. రాజ్యాంగ విలువలకు ఈ ప్రభుత్వం ఎప్పుడో తిలోదకాలిచ్చింది. బాబ్రి మసీదు వివాదం పైనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గగోయ్ బీజేపీకి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. పదవీ విరమణ తర్వాత గగోయ్‌కి రాజ్యసభ పదవి దక్కింది. గుజరాత్‌లో కోర్టులు బీజేపీకి అనుకూలంగా తీర్పులిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. న్యాయశాఖను, దర్యాప్తు సంస్థలను, దాదాపు పూర్తిగా మీడియాను దుర్వినియోగం చేస్తున్నారు. 2014 లో మోదీ అధికారంలోకి రాగానే దర్యాప్తు సంస్థలను, పోలీసు వ్యవస్థను, న్యాయ వ్యవస్థను తన అధీనంలోకి తెచ్చుకొనేందుకు వ్యూహాన్ని పన్నారు. కొద్ది కాలంలోనే రాష్ట్రాలకున్న హక్కులలో కొన్నింటిని హరించారు. ముస్లింల చేతుల్లో అధికారం ఉండకూడదని నిశ్చయించుకొని జమ్మూ కశ్మీరుకున్న ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించేందుకు 370 వ అధికరణను రద్దు చేసి అనుకున్నది సాధించారు. తొలి నుండి నల్ల కుబేరుల నుండి ధనాన్ని సమీకరించారు. ఆర్‌ఎస్ఎస్ ఆకాంక్ష ప్రకారం పాలన సాగిస్తున్నారు. ఈ డబ్బుతో కర్నాటక, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చివేశారు. చాలా రాష్ట్రాలలో ఎన్నికల ద్వారా బీజేపీ గెలవలేదు. ధనబలం ఉపయోగించి బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 2014 ఎన్నికల ప్రణాళికలో ప్రజలకిచ్చి వాగ్దానాలను ఇప్పటికీ అమలుచేయలేదు. పెద్ద నోట్లు రద్దు ద్వారా నల్ల ధనాన్ని తెల్ల ధనంగా మార్చుకునేందుకు ఆశ్రిత సంపన్నులకు ప్రయోజనం చేకూర్చారు. అనేక అంశాలలో రాజ్యాంగాన్ని ఖాతరు చేయకుండా నియంతృత్వ లక్షణాలను ప్రదర్శించారు. ఈ ధోరణి నేడు మరింతగా ముదిరింది. ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలను సృష్టిస్తానని వాగ్దానం చేసిన మోదీ నేడు యువత ఉద్యోగాల కోసం చూడకుండా, ఉద్యోగాలను ఇచ్చేందుకు పరిశ్రమలు పెట్టమని సలహాలిస్తున్నారు. ముస్లింలను, క్రైస్తవులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేందుకు వివిధ వ్యూహాలను రూపొందించారు. ఇందులో భాగంగానే సీఏఏ ప్రవేశపెట్టారు. ముస్లింలను వీలయితే దేశం నుండి వెళ్లగొట్టేందుకు వెనకాడరని అనేక సూచనలు కన్పిస్తున్నాయి.

దొంగలు పడ్డారు

-వేల్పుల నారాయణ

దొంగలు పడ్డారురో-దేశమంతా నేదురా
దేశమంతా నేదురా-దేశమేలెటోళ్లురా
ప్రజలగొంతు పైన గన్ను-పేల్చుతున్న వాళ్లురా
ప్రజాస్వామ్య హక్కులన్ని-పాతరేసెటోళ్లురా

అటు కేంద్రం ఇటు రాష్ట్రం-అంతట వాళ్లేనురా
అందినంతా దిగమింగే-అవినీతిగాళ్లురా
సంక్షేమం అభివృద్ధని-సోదిచెప్పెటోళ్లురా
స్కాములల్లో వేలకోట్లు-స్వాహా చేసినోళ్లిరా ? దొంగలు?

వ్యాపారుల కార్పొరేట్ల-అక్రమాల్లో వీళ్లురా
అన్నిట్లో భాగస్తులు-అంటకాగినోళ్లురా
ఎలెక్ట్రోల్ బాండ్లల్లో-ఎంతో దొబ్బినోళ్లురా
ఎరుగనట్లే పైకి నీతి-ఒలుకబోసెటోళ్లురా ? దొంగలు?

మతమంటూ విద్వేషం-విషం చిమ్మెటోళ్లురా
మనలో మనకు చిచ్చుపెట్టి-మనల చీల్చెటోళ్లురా
మన లౌకిక విధానాన్ని-మంటగలిపెటోళ్లురా
సంస్కృతి బహుళత్వాన్ని-సావగొట్టెటోళ్లురా? దొంగలు?

సర్కారు కంపెన్లను-సర్వమమ్మె వాళ్లురా
కార్పొరేట్ కంపిన్లకు-కబ్జా చేసినారురా
కోట్ల కొలువులంటూ గొప్ప-ఆశపెట్టినోళ్లురా
ఉన్న కొలువులూడబీకి-ఉరినిబెట్టినారురా ? దొంగలు?

ధరలమీద ధరలు పెంచి-దగా చేసినోళ్లురా
అభివృద్ధి దేశప్రగతి-అసలు పట్టనోళ్లురా
అన్యాయం అన్నోళ్లను-అణచివేసినారురా
దర్యాప్తులు కేసులతో-దాడి చేసెటోళ్లురా ? దొంగలు?

మనల ముంచి మనల వంచి-మనల దోచినోళ్లురా
మాయచేసి గెలిచేందుకు-మళ్ల వచ్చినారురా
మర్మమెరిగి దొంగలను -మట్టుబెట్ట ఓడించరా
ప్రజల పోరు పార్టీలను-పట్టుపట్టి గెలిపించరా
చట్టసభలో ప్రజావాణి-సైరన్ వినిపించరా? దొంగలు?

శశి థరూర్‌కు పన్నియన్ దడ

కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి పన్నియన్ రవీంద్రన్ కాంగ్రెస్ అభ్యర్థి శశిథరూర్‌కి చమటలు పట్టిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలిచి నాలుగోసారి కూడా విజయం సాధించాలన్న శశిథరూర్ ఆశలపై పన్నియన్ నీళ్లు జల్లారు. ఎల్డీఎఫ్ మధ్య సీట్ల పంపిణీ, అభ్యర్థుల ప్రకటన ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి చాలా ముందుగానే జరగడంతో వామపక్ష సంఘటన ముఖ్యంగా సీపీఐ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. శశిథరూర్‌తో పాటు బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వెనుకబడ్డారు. 2009, 2014, 2019లో గెలిచిన థరూర్ ఈ ఎన్నికల్లో తన విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కానీ పన్నియన్ సీపీఐ అభ్యర్థిగా పోటీలో నిలుస్తూనే థరూర్ లెక్కలను తారుమారు చేశారు. వామపక్ష వ్యతిరేక మీడియా కేరళ రాజధానిలో థరూర్, రాజీవ్ మధ్య పోటీ అని హడావుడి సృష్టిస్తోంది. ఆ మీడియా ఇటువంటి ప్రచారం చేయడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) అభ్యర్థులను నిలదీయడానికి ప్రతిపక్ష అనుకూల మీడియా ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంది. అందులో పన్నియన్ మినహాయింపు కాదు.

15 ఏళ్ల తర్వాత నియోజకవర్గాన్ని కైవసం చేసుకునేందుకు ఎల్‌డీఎఫ్ అన్ని విధాలా శ్రమిస్తోంది. 2005లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ తరపున రవీంద్రన్ విజయం సాధించారు. పన్నియన్‌కు ఉన్న ప్రజాభిమానాన్ని ప్రతిపక్షాలు కాస్త ఆలస్యంగానైనా గ్రహించాయి. ఎంపీగా ఆయన రికార్డును నియోజకవర్గ ప్రజలు ఎన్నటికి మరిచిపోరు. తిరువనంతపురం నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎంతగానో శ్రమించారు. అనేక ప్రాజెక్టులను పొందడంలో ఆయన కృషి విస్మరించలేనిది. తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయం రెండో దశ అభివృద్ధికి రూ.245 కోట్లు, మూడో దశకు రూ.255 కోట్లు ఎంపీగా ఉన్న సమయంలో పన్నియన్ రాబట్టగలిగారు. చక్కా వద్ద ఏరో బ్రిడ్జ్, రూ. 90 కోట్ల హ్యాంగర్ యూనిట్ కూడా పన్నియన్ కృషి వల్ల వాస్తవరూపం దాల్చింది.

రాష్ట్రానికి 11కొత్త రైళ్లను తీసుకురావడంలో ఎంపీగా సీపీఐ అగ్రనాయకుడు విజయం సాధించారు. కేరళ రాజధానికి బ్రహ్మోస్ ఆర్‌పీఎఫ్ సెంట్రల్ స్కూల్‌ను తిరువనంతపురానికి తీసుకురావడానికి ఆయన చేసిన కృషిని ఓటర్లు ఎన్నటికీ మరిచిపోరు. రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చేయడంలో పన్నియన్ కీలక పాత్ర పోషించారు. ఎంపిగా చేసిన ఈ అద్భుతమైన కృషి ఆధారంగానే అపారమైన ప్రజాదరణ పొందిన పన్నియన్ 15 సంవత్సరాల తర్వాత రెండవసారి ఎంపీ పదవికి పోటీపడుతున్నారు. ఆయన నిష్కళంక ప్రజాసేవకుడు, ఎటువంటి ఆరోపణలు లేని ప్రజా నాయకుడు కోవలం అసెంబ్లీ నియోజకవర్గం మినహా, తిరువనంతపురం లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్‌డిఎఫ్ మంచి ఆధిక్యం సాధించడం పొన్నియన్‌కు అనుకూలంగా ఉన్న మరో ప్లస్ పాయింట్. పోలింగ్ రోజు నాటికి థరూర్, రాజీవ్‌కు అందనంత దూరంలో పన్నియన్ ఉంటారన్నా ఆశ్చర్యం లేదు. తిరువనంతపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడానికి పన్నియన్ అన్ని విధాల అర్హుడు. నిర్భయ, పేద , అణగారిన ప్రజల గొంతుక పన్నియన్. వారి సమస్యలను ఉత్సాహంగా చేపట్టే వ్యక్తి. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కలయిక నేతృత్వంలోని మతతత్వ శక్తులను ధైర్యంగా ఎదుర్కొనే ధీశాలి. మైనారిటీల నుంచి ఆయనకు ఎనలేని మద్దతువుంది. మైనారిటీలకు కాంగ్రెస్ దూరం కావడం సీపీఐ అభ్యర్థిని విజేతగా నిలబెట్టడానికి సహాయపడుతుందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. థరూర్‌కు ఈ దఫా విజయం నల్లేరుపై నడక వంటిది కాదు. గత 15 ఏళ్లలో నియోజకవర్గానికి ఆయన చేసిన అభివృద్ధి లేదు. ఎల్‌డిఎఫ్ ప్రయత్నాల వల్లే సాకారమైన ప్రాజెక్టుల క్రెడిట్‌ను థరూర్ తన ఖాతాలో వేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. థరూర్ ఇంటా బయట తీవ్ర అసంతృప్తిని ఎదుర్కొంటున్నారు. పార్టీలో తిరుగుబాటును ఎదుర్కొంటున్నారు. అసంతృప్తితో ఉన్న పార్టీ నాయకత్వం యువజన కాంగ్రెస్ నాయకుడు ఒకరిని తిరుగుబాటు అభ్యర్థిగా రంగంలోకి దింపింది. థరూర్ ఓట్లను ఆ అభ్యర్థి బాగా చీలుస్తాడని రాజకీయ పరిశీలకు భావిస్తున్నారు. అలాగే, గతంలో జరిగిన అన్ని ఎన్నికల్లోనూ థరూర్ క్రైస్తవ ఓట్లలో సింహభాగం పొందగలిగారు. ఈ ఎన్నికలలో ఆ పరిస్థితి లేదు. విజింజం ఓడరేవు నిర్మాణం నేపథ్యంలో తమ దుస్థితిపై థరూర్ వైఖరిపై క్రైస్తవ ఓటర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పౌరసత్వ సవరణ చట్టం, ఎలక్టోరల్ బాండ్‌లు, హిందుత్వంపై మృదువైఖరి వంటి సమస్యలపై కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరితో కూడా థరూర్ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ విషయానికొస్తే, ఆయన చాలా వెనుకబడి ఉన్నారు. నియోజకవర్గానికి పూర్తిగా అపరిచితుడు కావడం ఆయనకున్న అతి పెద్ద సమస్య. కేంద్ర మంత్రిగా కూడా నియోజకవర్గంలోని ప్రజలకు ఆయన పరిచయంలేదు. స్థానికేతురుడు కావడంతో ప్రజలు అసలు పట్టించుకోవడంలేదు. అనుభవం లేమి ఆయన ప్రచారంలో కనిపిస్తోంది. చాలా సందర్భాలలో, మీడియా సిబ్బంది అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చేటప్పుడు రాజీవ్ చంద్రశేఖర్ ఇబ్బందికర స్థితి ఎదుర్కొంటున్నారు. ఆయనకు బీజేపీ శ్రేణుల నుంచి కూడా పూర్తి మద్దతు లభించడం లేదు. అన్ని ప్రీ-పోల్ సర్వేలు బీజేపీ అభ్యర్థి మూడవ స్థానంలో పేలవంగా ఉంటారని అంచనా వేశాయి.

2019 ఎన్నికలలో థరూర్‌కు 4.16,131 ఓట్లు పోలుకాగా, బీజేపీ అభ్యర్థి కుమ్మనం రాజశేఖరన్‌కు 3,16,142 ఓట్లు, సీపీఐ అభ్యర్థి సి. దివాకరన్‌కు 2,58,556 ఓట్లు లభించాయి.

27 పైసలా... మంచి నాయకుడా...!

ప్రజలను చైతన్య పరుస్తున్న సోషల్ మీడియా

ఓటరులారా... ఒక్క నిముషం ఆలోచించండి. ఐదేళ్ల పాలన కోసం ఐదు వందలు తీసుకుని ఓటేస్తామా...! అంటే రోజుకు కేవలం 27 పైసలే... ఈ మొత్తాన్ని ఈ రోజుల్లో బిచ్చగాళ్లు కూడా తీసుకోవడం లేదు. మరి మీరు... ఆలోచించండి.. మంచి నాయకుడు కావాలా... 27 పైసలు కావాలా...? ఇటీవల ఫేస్ బుక్‌లో హల్చల్ చేస్తున్న పోస్టు ఇది. ఈ పోస్టుకు వేల సంఖ్యలో షేర్లతో, కామెంట్లతో, లైకులతో విస్తృతంగా ప్రచారం వస్తోంది. ఒక్క నిముషం ఆలోచించండి... మతతత్వ పార్టీ బీజేపీ (నరేంద్ర మోదీ)... ప్రజల కోసం పనిచేసే ఇండియా కూటమి ఎవరు కావాలో ఆలోచించుకోండి... ఇలాంటి పోస్టులతో లౌకికవాదులు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. వీటితో పాటు అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలు, ఆయా పార్టీల విధానాలను, నాయకులను కడిగి పారేస్తున్నారు. గతంలో ఎన్నికల ప్రచారం పోస్టర్లు, బ్యానర్లు, గోడరాతలతో చేసేవారు. ప్రస్తుతం దీని రూపు మారిపోయింది. నేడు ఇంటర్నేట్ ద్వారా కూడా అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 19 నుంచి జరిగే సార్వత్రిక ఎన్నికలు, నాలుగు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకంగా మారింది. 2009వరకు జరిగిన ఎన్నికల్లో ఫెస్‌బుక్, ట్విట్టర్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలు లేవు. అప్పట్లో అంతగా ఇంటర్నేట్ ప్రచారమూ లేదు. ప్రస్తుతం పట్టణాల నుంచి పల్లెల వరకు ఇంటర్నేట్ సౌకర్యం బాగా అందుబాటులోకి వచ్చింది. యువత ఎక్కువగా ఇంటర్నేట్‌ను ఉపయోగిస్తున్నారు. ఓటర్లలలో కూడా యువత అత్యధిక శాతం ఉండటంతో ఈ సోషల్ మీడియాను ఉపయోగించుకుని వారిని ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. కొంతమంది సామాజిక చైతన్యం కలిగిన వ్యక్తులు, సంస్థలు ఎన్నికల వ్యవస్థ మార్పు కోరుతూ అనేక విధాలుగా పోస్టులు చేస్తున్నాయి. ఓటు హక్కు వినియోగం, ఓటు ప్రాధాన్యత, రాజకీయ నాయకుల నుంచి డబ్బులకు అమ్ముడు పోవద్దంటూ తమ ప్రచారాన్ని విస్తృత పరుస్తున్నాయి. ఈ పోస్టులకు యువత నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ ఎన్నికల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందనడంలో సందేహమే లేదు.

కమ్యూనిస్టు మసీదు
కమ్యూనిస్టుల ఆదర్శం

శీర్షిక ఆశ్చర్యం కలిగిస్తోంది కదూ ! ఓట్ల కోసం చరిత్రాత్మక బాబ్రీ మసీదునే కూల్చివేసిన పార్టీని ప్రత్యక్షంగా చూశారు. మసీదులను కూల్చేవారితో మాకెలాంటి సంబంధం లేదంటూ ఓట్ల కోసం నాడు దొంగేడ్పులు ఏడ్చి ఇప్పుడు దేశం కోసం అంటూ వారిని భుజానకెత్తుకుంటున్న వారిని చూస్తున్నారు. కమ్యూనిస్టులు మతాలను, వాటి దేవుళ్లను నమ్మరు. అంతమాత్రాన అధికారంలో ఉన్న చోట ఎక్కడా ఏ ఒక్క ప్రార్థనా మందిరాన్ని కూల్చలేదు. అలా చేసి ఉంటే రష్యాలో చరిత్రాత్మక చర్చ్‌లన్నీ పదిలంగా ఎలా ఉండి వుండేవన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా అనేక మంది ఇప్పటికీ కమ్యూనిస్టులపై తప్పుడు ప్రచారం చేస్తుంటారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న కేరళ, గతంలో అధికారంలో ఉన్న పశ్చిమబెంగాల్, త్రిపురల్లో ముస్లింలు, క్రైస్తవులు గణనీయంగా ఉన్నారు. ఒక్క మసీదు గోడ పెచ్చుకూడా ఊడలేదు. కేరళలోని మలప్పురం జిల్లాలో పులామతోల్ జుమా మసీదుతో పాటు కమ్యూనిస్టు అగ్రనాయకుడు ఈఎంఎస్ నంబూద్రిపాద్ పేరు చిరస్థాయిగా చరిత్రలో మిగిలి పోతుందంటే ఆశ్చర్యంగా ఉంది -కదూ...

స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జనాన్ని ఉద్యమంలోకి తీసుకురావాలంటే తిలక్ వంటి నాయకులకు తోచిన మార్గం పండుగలు, జాతరలను ఉపయోగించుకోవటం. ఇప్పుడు బీజేపీ, శివసేన, మజ్లిస్ వంటి మత పార్టీలు కూడా అధికారానికి దగ్గరి దారిగా వాటిని పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్నాయి. బ్రిటీష్ పాలకులు

విభజించు, పాలించు అన్న కుటిల నీతిని ప్రయోగించినప్పటికీ స్వాతంత్ర్య పోరాటంలో మతాలతో నిమిత్తం లేకుండా హిందువులు, ముస్లింలు ఐక్యంగా భుజం భుజం కలిపి పోరాడబట్టే తెల్లవారిని మన దేశం నుంచి వెళ్లగొట్టగలిగాం. ముస్లింలు గణనీయంగా ఉన్న మలబార్ ప్రాంతంలో మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ ఖలీఫా సామ్రాజ్యాన్ని కూల్చివేసిన బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మన దేశంలో ఖిలాఫత్ ఉద్యమం తలెత్తింది. నాడు మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న మలబార్ ప్రాంతంలో మోప్లా తిరుగుబాటు పేరుతో సామాన్య ముస్లింలు, బ్రిటీష్ వారికి, వారికి మద్దతు ఇస్తున్న భూస్వాములు, జమిందారులకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు జరిపారు. దానిని అణచివేయటానికి ఏర్పాటు చేసిందే మలబార్ స్పెషల్ పోలీసు దళం. తరువాత కాలంలో తెలంగాణ సాయుధపోరాట అణచివేతలో భాగంగా కోస్తా ప్రాంతాలలో మలబార్ పోలీసులను నియమించిన విషయం తెలిసిందే. మోప్లా తిరుగుబాటు సందర్భంగా మసీదులు తిరుగుబాటు కేంద్రాలుగా మారటాన్ని చూసిన బ్రిటీష్ పాలకులు దానిని అణచివేసిన తరువాత మలబార్ ప్రాంతంలో కొత్తగా మసీదులు నిర్మించాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలంటూ మసీదు నిర్మాణాలపై పరోక్ష నిషేధం విధించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా దానిని కొనసాగించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తరువాత 1957లో కేరళలో తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే కొంత మంది మలబార్ ముస్లిం మత పెద్దలు పులామత్తోల్ పట్టణంలో మసీదు నిర్మాణానికి మంజూరు అనుమతి చేయాలని అప్పటి ముఖ్యమంత్రి నంబూద్రిపాద్‌ను కోరారు. దాంతో బ్రిటీష్ కాలంలో విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేసి అనుమతితో నిమిత్తం లేకుండా నిర్మాణాలను అనుమతించింది. అందుకే పులామల్ మసీదును కమ్యూనిస్టులకు అంకితం చేసినదిగా టైమ్స్ ఆఫ్ ఇండియా విలేకరి వ్యాఖ్యానించారు. ప్రజల చైతన్యాన్ని మొద్దుబార్చే మతం గురించి మత్తు మందు లాంటిదని మార్క్సిస్టు మహామహోపాధ్యాయులు చరిత్ర సారాన్ని ఒక వాక్యంలో తేటతెల్లం చేశారు. రాజకీయాలు, మతం వేరు, మత విశ్వాసాలు వ్యక్తిగతం. రాజకీయ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టులు ఎప్పుడూ రెండింటినీ కలగా పులగం చేయలేదు. అదే దేశ రాజకీయాలలో కమ్యూనిస్టుల ప్రత్యేకత, ఆదర్శం.

వ్యాపారి ఇంట్లో నోట్ల గుట్టలు

- రూ.7.6 కోట్ల లెక్కలు నగదు
- భారీగా బంగారం, వెండి ఆభరణాలు
- సీజ్ చేసిన పోలీసులు

లోక్‌సభ ఎన్నికల వేళ కర్నాటకలో భారీగా నగదు, బంగారం బయటపడింది. బళ్లారి జిల్లాలోని ఓ వ్యాపారి ఇంట్లో సోదాలకు వెళ్లిన పోలీసులకు రూ.7.6 కోట్ల నగదు, బంగారు, వెండి ఆభరణాలు దొరికాయి. అనంతరం వాటిని సీజ్ చేశారు. హవాలా కార్యకలాపాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం రావడంతో బ్రూస్‌పేట్ పోలీసులు స్థానిక ఆభరణాల వ్యాపారి నరేశ్ సోనీ ఇంట్లో ఆకస్మిక సోదాలు జరిపారు. లెక్కలు లేని భారీ నగదు, ఆభరణాలను గుర్తించారు. రూ.5.6 కోట్ల నగదు తోపాటు 103 కిలోల వెండి ఆభరణాలు, 68 వెండి కడ్డీలు, 3 కిలోల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్దమొత్తంలో డబ్బు, నగలను హవాలా మార్గం ద్వారా తీసుకొని వచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వ్యాపారి నరేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వివరాలను ఆదాయపు పన్ను విభాగానికి అందజేస్తామని, అనంతరం ఐటీ అధికారులు దీనిపై తదుపరి దర్యాప్తు చేపడతారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇటీవల కర్నాటకలోని చామరాజనగర్‌లో అధికారులు భారీ స్థాయిలో అక్రమ మద్యాన్ని పట్టుకున్న సంగతి విదితమే. రూ.99 కోట్ల విలువ చేసే బీర్ల కాటూన్‌లను అధికారులు సీజ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తి నుంచి చామరాజనగర్ లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల అధికారి సీటీ శిల్పనాగ్‌కు వచ్చిన సమాచారం ఆధారంగా ఎక్సైజ్ పోలీసులు మైసూర్ జిల్లా నంజనగూడు మండలం తాండ్యా ఇండస్ట్రియల్ ఏరియాలోని యునైటెడ్ బ్రేవరీస్ లిమిటెడ్ యూనిట్‌పై దాడులు జరిపింది. ఈ క్రమంలో రూ.98.52 కోట్ల విలువైన బీర్లను స్వాధీనం చేసుకున్నారు.

మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.లక్ష: రాహుల్

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళల అభ్యున్నతికి ఏటా రూ.లక్ష చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుందని హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం సియోని జిల్లా మండ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ధనోరాలో సోమవారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ. ఈ మేరకు హామీ ఇచ్చారు. "ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన మహిళలు, వెనుకబడిన తరగతులు, పేద కుటుంబాల మహిళల(బ్యాంకు)ల ఖాతాల్లోకి రూ. 1 లక్ష బదిలీ చేయడం వంటి మూడు నాలుగు విప్లవాత్మక హామీలను మా మేనిఫెస్టోలో ప్రస్తావించాం. ఈ విధంగా ప్రతి నెలా వారి ఖాతాల్లోకి వేల రూపాయలు జమ అవుతాయి" అని రాహుల్ తెలి పారు. మండ్ల సిట్టింగ్ ఎంపీ, ,కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తేపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఓంకార్ సింగ్ మార్క మ్‌ను పోటీకి దింపింది. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు చెల్లిస్తున్న వేతనాలు రెట్టింపు, యువత ఉపాధికి సంబం ధించి కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను ప్రకటించిందని రాహుల్ గుర్తు చేశారు. ప్రభుత్వ రంగంలో 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని రాహుల్ పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు ఎంఎస్పీ వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం రూపొందిస్తుందని తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ: దిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎదురుదెబ్బ తగిలింది. ఆమెకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తన చిన్న కుమారుడికి పరీక్షలు ఉన్నందున ఈ నెల 16 వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని రౌస్ అవెన్యూలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం...తీర్పును రిజర్వ్ చేసింది. వాదనల సమయంలో కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఈడీ వ్యతిరేకించింది. ఆమెకు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపింది. సాక్ష్యాలు, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే అప్రూవర్‌గా మారిన కొందరిని ఆమె బెదిరించారని, అందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని ఈడీ కోరింది. ఈడీ వాదనతో ఏకీభవిస్తూ మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ కోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు కవిత దాఖలు చేసిన సాధారణ బెయిల్ పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 20న విచారణ జరపనుంది. దిల్లీ మద్యం కేసులో ఈడీ మార్చి 15న ఆమెను అరెస్టు చేసింది. మార్చి 26 నుంచి ఆమె తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

'జంగాల'ను గెలిపించుకుంటాం

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీర్మానం

విశాలాంధ్ర-గుంటూరు: ఇండియా కూటమి తరపున గుంటూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌కు వివిధ వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా సమితి జంగాలకు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు గుంటూరులోని మల్లయ్యలింగంభవన్‌లో సోమవారం అసోసియేషన్ జిల్లా సమితి సమావేశం జరిగింది. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా అహర్నిశలు కృషి చేస్తున్న గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల సహా ఇండియా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని అసోసియేషన్ జిల్లా సమితి తీర్మానించింది.

ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు జంగాల అజయ్ కుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేతినేని ఆగస్టీన్, నాయకులు పెదరామయ్య, సాంబశివరావు, షేక్ కరీముల్లా, అంజనా దేవి, రత్నమాల, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, తిరుపతిరెడ్డి, శేషగిరిరావు, హనీమీ బాయి, షేక్ బేగం, పి.అనురాధ, పి.నాగరాజు, సాలీబాయి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో భేటీ

గుంటూరు నగరంలోని ప్రముఖ న్యాయవాదులు చెరుకూరి సత్యనారాయణ, పెనుగొండ లక్ష్మీనారాయణ, జె.నరసింహారావు, సిద్ధ సత్యనారాయణ, దాసరి ఉమామహేశ్వరరావు, ఆదినారాయణ తదితరులను జంగాల అజయ్‌కుమార్ జిల్లా కోర్టు ఆవరణలో కలిశారు. ఇండియా కూటమి విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, కార్యదర్శి మేడా హనుమంతరావు, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి బందారపు శశి తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో...

గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 57వ డివిజన్ గణేష్ నగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన గ్రూప్ మీటింగ్‌లో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు చల్లా మరియదాసు, దుర్గారావు, గోపి, ప్రభాకర్, థామస్, మహాలక్ష్మి, కరుణా తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు చిరంజీవి రూ.5 కోట్ల విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ ప్రముఖ నటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి రూ.5 కోట్ల విరాళం ఇచ్చారు. హైదరాబాద్ నగర శివారులోని ముచ్చింతల్‌లో 'విశ్వంభర' షూటింగ్ లొకేషన్‌లో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఇద్దరూ వెళ్లి చిరంజీవిని కలిశారు. ఆత్మీయ ఆలింగనంతో సోదరులకు ఆయన స్వాగతం పలికారు. చిరంజీవి పాదాలకు నమస్కరించిన పవన్ ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురయ్యారు. కొద్దిసేపు ముగ్గురూ మాట్లాడుకున్నారు. నీ వెనక నేనున్నానంటూ చిరంజీవి భరోసా ఇచ్చారు. అనంతరం విరాళానికి సంబంధించిన చెక్కులను అందించి ఆశీర్వదించారు. అందరూ అధికారంలోకి వచ్చిన తరువాత సాయం చేస్తామంటారు. అధికారం లేకపోయినా, తన సంపదని రైతు కూలీల కోసం పవన్ కళ్యాణ్ వినియోగించటం నాకు సంతోషాన్ని కలిగించిన విషయం. తన స్వార్జితాన్ని సమాజం కోసం ఖర్చు పెట్టే మనసున్న తమ్ముడు పవన్ కళ్యాణ్. అతని లక్ష్యానికి కొంతైనా ఉపయోగపడుతుందని నేను సైతం జనసేనకి విరాళాన్ని అందించానని చిరంజీవి తెలిపారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) లో పోస్టు పెట్టారు.

నేడు 39 మండలాల్లో వడగాడ్పులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు రారెత్తిస్తున్నాయి. 39 మండలాల్లో మంగళవారం తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశముందని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివిధ జిల్లాల్లో ఉష్ణోగ్రతలను వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాల్లోని కొన్ని చోట్ల 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలతో మండుటెండలు ఉంటాయి. శ్రీకాకుళం, కాకినాడ, తూర్పుగోదావరి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్ఆర్ జిల్లాల్లోని అనేక మండలాల్లో 39 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, పల్నాడు, గుంటూరు, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని మండలాల్లో 35 నుంచి 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలతో వడగాడ్పులు వీయనున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పోస్టాఫీసుల ద్వారా ఓటర్లకు అవగాహన

పోస్టర్లు ఆవిష్కరించిన సీఈవో ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,670 పోస్టాఫీసుల ద్వారా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా శ్రీకారం చుట్టారు. ఇందుకోసం పోస్టల్ శాఖ ముద్రించిన వివిధ రకాల ఓటర్ల అవగాహనా పోస్టర్లను అదనపు సీఈవో ఎమ్ఎన్. హరేంధిర ప్రసాద్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ జనరల్ కందుల సుధీర్‌బాబుతో కలసి సోమవారం ఆయన తన ఛాంబరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంకే మీనా మాట్లాడుతూ క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమం అమల్లో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు భారత ఎన్నికల సంఘం పోస్టల్ శాఖతో ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా వివిధ రకాల పోస్టర్లను పోస్టల్ శాఖ ముద్రించినట్లు తెలిపారు.

ఆయా పోస్టాఫీస్‌ల ద్వారా రాష్ట్రంలోని 57 హెడ్ పోస్టాఫీసులు, 1,512 సబ్ పోస్టాఫీసులు, 9,101 బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను విస్తృతస్థాయిలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఏపీలో ఆరుగురు ఐఏఎస్‌లకు పోస్టింగులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల సంఘం వేటుతో ఇటీవల బదిలీ అయిన ఏపీలోని ఆరుగురు ఐఏఎస్‌లకు పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికలతో సంబంధం లేని శాఖలను వారికి కేటాయించారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా లక్ష్మీ షాను నియమించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా రాజాబాబు, టీటీడీ జేఈవోగా గౌతమి, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్‌గా అంబేద్కర్, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీగా వెంకట్రామిరెడ్డి నియమితులయ్యారు. సీసీఎల్ఏ కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

జగన్, చంద్రబాబు ఉగాది శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శ్రీక్రోధి నామ సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి సీఎం వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు వేర్వేరుగా ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని తెలిపారు. కొత్త సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని సీఎం ఆకాంక్షించారు. అలాగే దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారందరికీ క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను చంద్రబాబు తెలిపారు. తెలుగు సంవత్సరంలో అడుగు పెడుతున్నామని, క్రోధి అంటే కోపంతో ఉన్నారని అర్థమని పేర్కొన్నారు.

మీకు ఏం కావాలో చెప్పండి

- కూటమి 'ప్రజా మేనిఫెస్టో'కు రూపకల్పన
- ప్రజాభిప్రాయ సేకరణకు వాట్సాప్ నెంబరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి త్వరలో విడుదల చేయనున్న ప్రజా మేనిఫెస్టో కోసం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు ఏం అవసరమో, మేనిఫెస్టోలో ఏం పొందు పరచాలో అభిప్రాయాలు తెలియజేస్తే, వాటన్నింటిలో ప్రాధాన్యత అభిప్రా యాలను మేనిఫెస్టోలో పొందుపరచాలని నిర్ణయించారు. ఇందుకోసం వాట్సాప్ నెంబర్ (8341130393)ను ఏర్పాటు చేశారు. టీడీపీ కేంద్ర కార్యా లయంలో సోమవారం ఆ పార్టీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, టీడీ జనార్థన్, దేవినేని ఉమామహేశ్వరరావు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జనసేన నేత గాదె వెంకటేశ్వర రావు, బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ పోస్టర్‌ను విడుదల చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ రాక్షస పాలనను అంతం చేయడమే కూటమి లక్ష్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసింది రాక్షసుడిని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకేనన్నారు. కూటమి మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేదిగా ఉంటుందన్నారు. కూటమి విజయంకోసం ప్రజలు తమ అమూల్యమైన అభిప్రాయాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి ఏర్పడిందని తెలిపారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.